AL - HILAL

# నెలవంక

మాస పత్రిక

Vol 7, Issue: 50 December - 2010

مجلة الهلال (باللغة التلغوية) – ملحق مجلة البشرى



## ఖుర్‌ఆన్ వెలుగులో యేసు (ఈసా عليه السلام)

## మానవ జీవిత లక్ష్యం?

IPC
لجنة التعريف بالإسلام
ISLAM PRESENTATION COMMITTEE
جمعية النجاة الخيرية

ఉచితం













“మానవులారా! మరణానంతర జీవితం గురించి మీకేమైనా అనుమానం ఉంటే కాస్త ఆలోచించండి.. మేము మిమ్మల్ని మట్టితో సృష్టించాము, ఆ తరువాత వీర్యపు బొట్టుతో, ఆపైన గడ్డకట్టిన రక్తంతో, అటు పిమ్మట మాంసపు ముద్దతో చేశాము - అప్పటికి అది రూపం కలదిగానూ, రూపరహితంగానూ ఉన్నది. మేము మీకు స్పష్టంగా తెలియజేసేందుకు (ఇదంతా చేస్తున్నాము)”

(దివ్య ఖుర్ఆన్- 22: 5)

# నెలవంక

(AL-HILAL MONTHLY)

Vol 7, ISSUE: 50
December 2010

CHIEF PATRON
Muhammad Ismail Ansari

GENERAL SUPERVISION
Khalid Al-Sab'a

EDITOR
Syed Abdus Salam Omeri

EDITORIAL BOARD
Sk. Habeebur Rahman Jamaee
Sk. Abdus Salam Omeri
Sk. Muhammad Bilal
Tahera Begum

PHONE
Syed Abdus Salam Omeri
97248933

FAX
22400057

P.O.BOX: 1613
SAFAT-13017, KUWAIT

PUBLISHED BY
IPC
Islam Presentation Committee
Kuwait
www.ipc.org.kw

DESIGN
Nader Belal

مؤسسة زخرف للدعاية والإعلان
Zukhruf Advertising Agency

www.zukhruf.net
Tel. 99993072

## ఈ సంచికలో....

దృక్పథం ........ 2
స్ఫూర్తిదాయకం వారి చరితం ........ 3
ఖుర్ఆన్ వెలుగులో యేసు.. ........ 4
దైవేతర దాస్యాన్ని సహించని పక్షి ........ 6
మానవ జీవిత లక్ష్యం ........ 8
నిండు చందురుడు నిరతం... ........ 10
ధర్మ సందేహాలు ........ 11
ఇస్లాం శిక్షణ ........ 12
కవితా కుసుమాలు ........ 13
ప్రవక్త అయ్యూబ్ (అ) ........ 14
ఐపిసి వార్తలు ........ 16
శాఖా చంద్ర న్యాయం ........ 18
నేటి బాలలే రేపటి పౌరులు - 8 ........ 19
నెలవంక ఉత్తరాలు ........ 20




كلمة العدد ◂ بناء المجتمع ◂ عيسي بن مريم (عليها السلام) في القرآن ◂ تنفير الطير من الشرك
ما هو الهدف الأساسي ◂ طلع البدر علينا ◂ الفتاوى الشرعية ◂ تربية المهتدين نشيد (الاستغفار
+ عيسي بن مريم) ◂ صبر أيوب عليه السلام ◂ الشرك بين العدل ◂ روضة الأطفال
رسائل الهلال

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

# సార్థక నామధేయులు కావాలి



ఎస్.ఎమ్.మలిక్
smmallick@hotmail.com

ముప్ఫై లక్షల మంది హజ్ యాత్రీకులు విశ్వ సామ్రాట్టు సన్నిధిలో శ్రద్ధాభక్తుల నివాళి ఘటించి తమ తమ స్వస్థలాలకు తిరుగు ప్రయాణమవుతున్నారు.

నిజంగా అదొక అపురూపమైన దృశ్యం! భూమండలంలోని నలుదిశలా విస్తరించివున్న ఆది దంపతులైన ఆదాం - హవ్వాల ముద్దు బిడ్డలు ఏటేటా ఒక కేంద్ర బిందువు వద్ద సమీకృతమవటం అమోఘం! ఎన్ని జాతులు, ఎన్ని తెగలు, ఎన్ని భాషలు, ఎన్ని సంస్కృతులు, ఎన్ని రివాజులు, ఎన్ని రంగులు, ఎన్ని అభిరుచులు!? కాని వీరంతా దేవుని కంటోన్మెంటుకు చేరగానే వాటన్నింటినీ విడిచిపెట్టేసి ఒకే మానవ సమాహారంగా రూపుదాల్చారు. ఒకే కలిమా ఆధారంగా మమేకమయ్యారు. ఒకే రంగు అయిన 'సిబ్గతుల్లాహ్'లో రంగరించబడ్డారు. దివి నుండి భువికి దిగివచ్చిన దివ్య దూతల్లా శ్వేతాంబరులై ముందుకు కదిలారు. ఇప్పుడు వారి మధ్య తరతమ భేదాలు లేవు. స్వార్థపరులు సృష్టించిన జాత్యాహంకార భేదాలు లేవు. సంకుచిత మనస్కులు పెంచిపోషించిన ప్రాంతీయ వాదాలు లేవు. కుత్సితులు నూరిపోసిన నిమ్నోన్నతా భేదాలు లేవు. హిపోక్రాట్లు సృష్టించిన కల్మషాలు లేవు. అజ్ఞానులు కల్పించిన అహంభావాలు లేవు. బూర్జువాలు నేర్పిన ధనిక - బీద తారతమ్యాలు లేవు. వారి మధ్య భాషా భేదాలూ లేవు. భేషజాలూ లేవు. ఇప్పుడు వారంతా ఒక్కటే..! వారి లక్ష్యం ఒక్కటే! వారి అధరాలు ఆలాపించే నినాదమూ ఒక్కటే!

వారంతా పుణ్యపురుషులు సంచరించిన పవిత్ర భూమిపై కాలుమోపారు. దైవవాక్కు ఉన్నతికై జీవితాలను ధారబోసి త్యాగమయుల అడుగుజాడల్లో నడిచారు. హష్ర్ మైదానాన్ని తలపించే అరఫాత్ ప్రదేశంలో విడిది చేసి క్షమాపణ కోరుకున్నారు. పైశాచిక శక్తులపై తిరుగుబాటుకు సంకేతంగా జమరాత్‌లపై కంకర రాళ్లు రువ్వారు. అవసరమైతే దైవాజ్ఞపై సర్వస్వాన్నీ అర్పించటానికి సిద్ధంగా ఉంటామన్న దానికి ప్రతీకగా ఖుర్బానీ ఇచ్చారు.

**హాజీ మహోదయులారా!**

ఇస్లాం పంచాంశాల్లోని ఒక ముఖ్యాంశాన్ని నెరవేర్చే అవకాశం మీకు ప్రాప్తించింది. మీరు నిజంగా ధన్యులు. దైవ చిత్తమయితే మీ హజ్‌కు ఆమోద ముద్ర పడుతుంది. మీ సంకల్పంలో గనక పరిశుద్ధత ఉంటే మీ పాపాలు ప్రక్షాళనమై, మీరు దోష రహితులై, అప్పుడే మాతృ గర్భం నుంచి జన్మించిన శిశువుల్లా మీరు తిరిగి వస్తారు. అవును, మీకు ఓ కొత్త జీవితం లభిస్తుంది. గతం గతః. ఇక మీ శేష జీవితం ఇతరులకు స్ఫూర్తిదాయకం కావాలి. మీరు చీకటి బ్రతుకుల్లో వెలుగు నింపాలి. ఇక మీదట మీరు విద్యుద్దీపాలతో మిరిమిట్లు గొలిపే పట్నాల్లోనే చీకట్లో మగ్గుతున్న వారికి దారి చూపాలి. అన్యాయాన్ని, అరాచకాన్ని, అశ్లీలాన్ని, అపసవ్యతను అరికట్టేందుకు మీరు నడుం బిగించాలి.

**హాజీ మహోదయులారా!**

దేవుని పిలుపుపై మీరు 'హాజరయ్యామ'ంటూ స్పందించి మక్కా వెళ్ళారు. కాని అనుదినం మీ ఊరిలోని, మీ వాడలోని మస్జిద్ నుండి ఐదు పూటలు అజాన్ పిలుపు వినవస్తోంది. హయ్యా అలస్సలాహ్ (నమాజు వైపునకు రండి) హయ్యా అలల్ ఫలాహ్ (సాఫల్యం వైపునకు రండి) అన్న పిలుపు పదే పదే మీ కర్ణపుటాలను తాకుతోంది. ఈ పిలుపుకు మీ నుండి లభించే స్పందన ఎలా ఉంటుందా! అని నింగినున్న వాడూ గమనిస్తాడు. నేలనున్న వారు కూడా శ్రద్ధగా గమనిస్తారు. మీ పేరుకు ముందు 'అల్ హాజ్' అనే గౌరవ బిరుదు తగిలింది. మరి సార్థక నామధేయులనిపించుకునే బాధ్యత మీదే సుమా!





శాంతి ప్రియ

# స్ఫూర్తిదాయకం వారి చరితం

'సమ్యక్ ప్రదానం సంప్రదాయం' – గతమంతా సంప్రదాయం కాదు, గతంలోని మంచి మాత్రమే సంప్రదాయం. వేల సంవత్సరాల పూర్వం ఆవిర్భవించినది ఇస్లామీయ అపురూప సంప్రదాయం. ఆ వేల సంవత్సరాలలో వేనవేల ప్రవక్తలు ప్రభవింపజేయబడ్డారు. నాటి నుండి రకరకాల ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంఘీక, రాజకీయ ప్రతికూల పవనాల ధాటికి తట్టుకుని నేటికీ నిలబడిన ప్రవక్తల సంప్రదాయాలు బహు స్వల్పం. కాలం విధించిన అగ్ని పరీక్షలకు ఆగి, సలసల కాగి ఈ నాటికీ ఆదర్శనీయాలుగా, ఉత్తమ శ్రేణికి చెందిన సంప్రదాయాలుగా విరాజిల్లుతున్నాయి. ప్రజా జీవితాల్లో అణువణువునా జీర్ణించుకుపోయిన ఆ మధుర ఘట్టాల కోసమైనా, ఆ పేరెన్నికగన్న కొందరు ధీర శాంతుల కోసమైనా మనం ప్రాచీన చరిత్రను పఠించవలసి ఉంది. ఆ ప్రవక్తోత్తములు ప్రతిపాదించిన సంప్రదాయాల, ఆదర్శాల, ప్రవేశపెట్టిన సిద్ధాంతాల పునాదుల మీదనే సరికొత్త ప్రణాళికలు, వజ్ర సౌధాలు నిర్మించుకోవలసి ఉంది. గతంలోగానీ, వర్తమానంలోగాని, భవిష్యత్తులోగాని వారి సంప్రదాయాలను కాదని కీర్తి శిఖర అంబరాలకు చేరుకోవడం అసాధ్యం, అసంభవమూను. అయితే అలా చేయాలని, కీర్తి శిఖర శిరస్సుకి చేరుకోవాలని దుస్సాహసం చేసిన ఔత్సాహికులు లేకపోలేదు. కాని ఏమి లాభం? ఎగిరిన మరుక్షణంలోనే చతికిల పడ్డారు పాపం!

యుగయుగాల ప్రవక్తల చరిత్రను హేతువు దృష్టితో, పక్షపాత రహిత సూక్ష్మ దృష్టితో పరిశీలిస్తే తెలుస్తుంది. ఈనాటికీ ప్రవక్తోత్తములు (ఊలుల్ అజ్మ్ మినర్రుసుల్)గా నీరాజనాలందుకుంటున్న ఆ పురుషోత్తముల వెనక ఏ ఘనాఘనుడి హస్తం ఉందో. ప్రకృతి రమణీయతను పుడిసిలించుకున్న ఆదం, ఆదం ఆధ్యాత్మిక చింతనను ఆకళింపు చేసుకున్న నూహ్, నూహ్ కమనీయతను జీర్ణించుకున్న ఇబ్రాహీమ్, ఇబ్రాహీమ్ త్యాగశీలతను ఒంటబట్టించుకున్న మూసా, మూసా ధర్మ శాస్త్రాన్ని అనుసరించిన ఈసా, ఈసాను మహిమ పరచి, ఆ సనాతన ధర్మాన్ని పరిపూర్ణం గావించిన ముహమ్మద్ (ﷺ)- వారందరి శాంత ప్రవచనాలు ఎంత పటిష్టంగా ఉంటాయో అభిజ్ఞులకు తెలిసిందే.

ఈ ఐదుగురు (నూహ్, ఇబ్రాహీమ్, మూసా, ఈసా, ముహమ్మద్ (عليهم السلام)) ప్రవక్తలు విభిన్న కాలాల్లో, వేర్వేరు ప్రాంతాల్లో వచ్చారు. ఐదుగురి తీరుతెన్నులూ వేర్వేరు. కానీ వారందరూ సమకాలీన సమాజాన్నీ, ఆ తరువాతి తరాలనూ ప్రభావితం చేశారు. ఒక విశిష్ట లక్షణం ఈ ఐదుగురిని, ఈ ఐదుగురితో పాటు 1 లక్షా 24 వేల ప్రవక్తలను ఏక సూత్రంలో ముడి వేసింది. అదే తౌహీద్. ఈ ఐదుగురూ తౌహీద్ విశిష్టతను విశద పర్చినవారే. దేవుని ఔన్నత్యాన్ని చాటినవారే, ఏకేశ్వరోపాసనా భావాన్ని తమ మనోవాక్కర్మల ద్వారా, ప్రబోధనాల ద్వారా దీపింపజేసినవారే. మానవ జాతి తరతరాలకూ చెప్పుకోగలిగే, ఆచరించగలిగే ఉత్తమోత్తమ ప్రబోధనలు చేసినవారే.

'వ ఖుల్ జాఅల్ హఖ్ఖు వ జహఖల్ బాతిల్ ఇన్నల్ బాతిల కాన జహూఖా' – సత్యం వచ్చేసింది. అసత్యం నిష్క్రమించింది. నిష్క్రమించటం తప్ప అసత్యానికి మార్గాంతరం లేదు. ఇది దైవ వాక్కు. యుగయుగాలుగా ప్రకృతీ, ప్రజలు అనుభవిస్తున్న సత్య వాక్కు. నిద్ర సగం మృత్యువు. జీవులకు ఇది ఏనాడూ తప్పదు, నిజమే. అంతమాత్రాన నిద్ర కాదు గెలిచేది – జాగృతి. తమస్సు కాదు నిలిచేది – ఉషస్సు. ఖుర్ఆన్ కాంతి (నూర్). కాంతి చైతన్య స్వరూపం. అందుకే అనుదినం చీకటి దిశలో అరుణారుణ భానుదీపం. కాంతి స్వేచ్ఛకు ప్రతిరూపం. ఖుర్ఆన్ అంతే. చీకటి దుప్పటి కప్పుకొని గురకపెట్టే లోకం కనులు విప్పేది దివ్యావిష్కృతి.

నాదాలు, నినాదాలు, మనిషి చేసిన మత సిద్ధాంతాలు కొందరిని కొంతకాలం మేల్కొల్పవచ్చు. రాజకీయాలు కొందరిని రగుల్గొల్పవచ్చు. విశ్వ శాంతి మార్గానికి పూబాట వేసే దైవ వచనం – సమాజాభ్యుదయం అదనెరిగిన ప్రవక్తల ప్రవచనం జాతి, భాష, కుల, ప్రాంత కృత్రిమ గీతలు దాటి అందరినీ మేల్కొల్పుతుంది. అన్ని కాలాల్లోనూ చైతన్య స్ఫూర్తిని రగుల్గొల్పుతుంది. అందుకే అన్ని విధాలా సురక్షితమైన అంతిమ దైవ గ్రంథం ఖుర్ఆన్ విశ్వ జనీనం, సార్వకాలికం.

(మిగతాది 20వ పేజీలో)

ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

# ఖుర్‌ఆన్ వెలుగులో యేసు (ఈసా (عليه السلام))



అంతిమ దైవ గ్రంథమైన ఖుర్‌ఆన్‌లో పలువురు ప్రవక్తల ప్రస్తావన వచ్చింది. కాని దైవ ప్రవక్త ఈసా (యేసు క్రీస్తు)ను గురించి ఖుర్‌ఆన్ ఎప్పుడు ప్రస్తావించినా విశిష్ఠమైన రీతిలోనే ప్రస్తావించింది. యేసు మాత అయిన మర్యమ్ గొప్పతనాన్ని ప్రత్యేకంగా కొనియాడింది. అంతేకాదు, మర్యమ్ పేరుతో ఖుర్‌ఆన్‌లో ప్రత్యేకంగా ఒక అధ్యాయమే అవతరించింది.

మీరెప్పుడైనా ఆలోచించారా! అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్ (స)కు ప్రాణసఖి అయిన ఆయిషా (ర) పేరుతోగానీ, ముద్దుల పుత్రిక ఫాతిమా (ర) పేరుతో గానీ ఖుర్‌ఆన్‌లో ఏ అధ్యాయమూ అవతరించలేదు. అయితే మేరీ మాత పేరుతో ప్రత్యేకంగా ఒక సూరా అవతరించటం, ఆమె సౌశీల్యం గురించి, భక్తిప్రపత్తుల గురించి, పసితనంలో ఆమెపై కురిపించబడిన ప్రత్యేక అనుగ్రహాల గురించి దేవుడు విడమరచి చెప్పటం ఒక విశేషం!

**దేవుడు** ఆమెకు ప్రసాదించిన వరాలలో అన్నిటికన్నా విచిత్రమైనది, అద్భుతమైనది **తండ్రి లేకుండానే ఆమెకు బిడ్డను ప్రసాదించటం.** కన్య అయిన తాను గర్భవతి కాబోతున్నట్లు దైవ దూత జిబ్రయీల్ ద్వారా తెలుసుకున్నప్పుడు మర్యమ్ నిలువెల్లా కంపించింది. గర్భవతి అని తెలుసుకున్న ఆమె జాతివారు ఒక్క సారిగా ఆమెపై విరుచుకుపడ్డారు. నానా యాగీ చేశారు. యదార్థానికి ఆమె ఏ పాపం ఎరుగని అమాయకురాలు. సౌశీల్యవతి. అయినవాళ్ల దూషణలను భరించలేక ఆమె జనవాసానికి దూరంగా వెళ్లినప్పుడు దేవుడు ఆమెకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాడు.

## నేను దేవుని దాసుడను, దైవ ప్రవక్తను

ప్రసవానంతరం ప్రజలు ఆమెను ఆడిపోసుకున్నపుడు ఆమె ఏమీ మాట్లాడలేదు. ఉయ్యాలలో ఉన్న తన పుత్ర రత్నం వంక సైగ చేసింది మర్యమ్. అభం శుభం తెలియని ఆ పసివాడ్ని అడిగి ఏం లాభం? అని జనులు అన్నప్పుడు ఉయ్యాలలో ఉన్న ఆ బాలుడు అల్లాహ్ ఆనతితో అద్భుతంగా పలికాడు: **"నేను అబ్దుల్లాహ్‌ను (దేవుని దాసుడను). ఆయన నన్ను తన ప్రవక్తగా ఎంపిక చేశాడు. నేనెక్కడ ఉన్నా నన్ను శుభవంతునిగా చేశాడు"** అని చెప్పేసరికి ప్రజలు మీమాంసలో పడిపోయారు. ఇస్రాయీలు సంతతిలో ఒక వర్గం వారు మర్యమ్ కుమారుడగు యేసు (ఈసా -అ)ని తిరస్కరించగా, మరొక వర్గం వారు ఆయన్ని విశ్వసించి, ఆయన ప్రబోధనలను అనుసరించారు. తరతరాలుగా జరుగుతూ వస్తున్నదే అప్పుడూ జరిగింది. సత్యాసత్యాలకు మధ్య సంఘర్షణ మొదలయింది. తిరస్కార జనులు యేసు (ఈసా)ను హతమార్చాలని కుట్ర పన్నినప్పుడు అల్లాహ్ విచిత్రమైన రీతిలో యేసును తన వైపుకు ఎత్తుకున్నాడు. ఆ తర్వాతి కాలంలో కొందరు యేసు తెచ్చిన నిజ ధర్మంలో మార్పులు చేర్పులు చేయగా, మరి కొందరు యేసుపట్ల ప్రేమలో అతిశయిల్లారు. యేసును 'ప్రవక్త స్థానం' నుంచి 'దైవ స్థానం'లో ప్రతిష్ఠించారు.

ఈ కారణంగానే దివ్యఖుర్‌ఆన్ మర్యమ్ కుమారుడగు యేసును గురించి కాల చక్రంలో భ్రమిస్తున్న అనేక సందేహాలకు, ఆక్షేపణలకు తనదైన రీతిలో సమాధానమిచ్చింది. ప్రేమలో అతిశయిల్లిన వారికి కూడా వాస్తవాలను విడమరచి చెప్పింది. ఒక్క మాటలో చెప్పాలంటే దివ్యఖుర్‌ఆన్ యేసు (ఈసా) వారి జీవితాన్ని ఒక తెరచిన పుస్తకంలా మన ముందుంచింది. రండి, ఖుర్‌ఆన్ వెలుగులో దాన్ని స్థూలంగానయినా అవలోకన చేద్దాం –

## యేసు పుట్టుక ఒక అద్భుతం

మర్యమ్ పోషణ బాల్యం నుంచే ఒక ప్రత్యేక తరహాలో దేవుని పర్యవేక్షణలో పెరిగింది. దైవ ప్రవక్త జకరియ్యా (అ) గారి సంరక్షణ ఆమెకి లభించింది. ఆ పసిపిల్ల బస చేసే ఏకాంత మందిరంలోనికి వెళ్ళినప్పుడు, అక్కడ ఆ సీజనులో పండని పండ్లు ఫలాలు ఉండటం చూసి జకరియ్యా నిర్ఘాంత పోయేవారు. ఈ విధంగా దేవుని పర్యవేక్షణలో పెరిగి, యౌవనానికి చేరిన ఆ శీలవతి ఒకసారి జనుల నుంచి, ఏకాంత స్థలంలోనికి వచ్చినప్పుడు జరిగిందేమిటో ఖుర్‌ఆన్ ఇలా వివరించింది:

**"ఆమె వారికి చాటుగా తెరవేసుకున్నప్పుడు మేము ఆమె వద్దకు మా**



తీర్పు దినాన మానవులు మళ్ళీ బ్రతికించబడతారన్న విషయానికి ఒక నిదర్శనంగా యేసు క్రీస్తును తండ్రి లేకుండా సృష్టించడం జరిగింది. ప్రవక్త యేసు (అ) పుట్టుకకు పూర్వం యూదుల్లోని ఒక వర్గం మరణానంతర జీవితం లేదని వాదించేది. ఈ వర్గాన్నే 'సెడ్యూసీస్' అనేవారు. లూకా, అధ్యాయం 20, 27వ వాక్యం ప్రకారం (పునరుత్థానము లేదని చెప్పెడి సద్దూ కయ్యులు) - మరణంతోనే జీవితం ముగిసిపోతుందని విశ్వసించేవారు. మరణానంతరం మళ్ళీ బ్రతికించబడటం అనేది లేదని అనేవారు.

ఆత్మ (జిబ్రయీల్ -అ)ను పంపాము. అతడు ఆమె ఎదుట సంపూర్ణ మానవాకారంలోనే ప్రత్యక్షమయ్యాడు. (ఆందోళన చెందిన మనసుతో) 'నేను నీ బారి నుంచి కరుణామయుడైన అల్లాహ్ శరణు కోరుతున్నాను. నీవు ఏమాత్రం దైవభీతి కలవాడవైనా (ఇక్కణ్ణుంచి వెళ్ళిపో)' అని ఆమె చెప్పింది. 'నేను నీ ప్రభువు తరఫున పంపబడిన దూతనమ్మా! నీకు పరిశుద్ధదైన ఒక మగ బిడ్డను ఇవ్వటానికి వచ్చానమ్మా!' అని అతనన్నాడు. దానికామె, 'అయ్యో! నాకు పిల్లవాడు కలగటమేమిటి? నన్ను ఏ మగాడూ కనీసం తాకనైనా లేదే! నేను దుర్నడత గల దాన్ని కూడా కానే' అని వాపోయింది. 'జరిగేది మాత్రం ఇదే. అది నాకు చాలా సులువు. మేమతన్ని ప్రజల కోసం ఒక సూచనగా, మా కటాక్షంగా చేయదలిచాము. ఇదొక నిర్ధారిత విషయం' అని నీ ప్రభువు సెలవిచ్చాడు" అని అతనన్నాడు.

(మర్యమ్: 16-21)

పై వాక్యాలలో అల్లాహ్ మానవాళికి చెప్పదలిచిందేమిటంటే; మేము ఏది చేయగోరినా అది మాకేమాత్రం కష్టం కాదు. మేము ఆ బాలుణ్ణి సృష్టి ప్రక్రియలో ఓ వినూత్న ఘట్టంగా, ఓ కొంగ్రొత్త ఆవిష్కరణగా చేయదలిచాము. ఇంతకు మునుపు మేము మీ పితామహుడైన ఆదామును 'స్త్రీ - పురుషుడు' లేకుండానే సృజించాము. మీ మాతృమూర్తి అయిన హవ్వాను కేవలం పురుషుని నుండి సృష్టించాము. మరి మీ అందరినీ స్త్రీ-పురుషుని జంట ద్వారా అవనిలో వ్యాపింపజేశాము. ఇప్పుడు యేసు (ఈసా - అ)ను నాల్గవ తరహాలో పురుషుడు లేకుండానే - కేవలం స్త్రీ ద్వారానే - సృష్టించి మా శక్తియుక్తులను మీకు చూపెట్టదలిచాము. సృష్టికి సంబంధించిన ఈ స్వరూపాలన్నీ కూడా మా శక్తిసామర్థ్యాలకు ప్రతీకలే.

ఆ విధంగా దైవ దూత జిబ్రయీల్ అల్లాహ్ ఆజ్ఞతో ఆమెలో ఒక ప్రాణాన్ని ఊదిన సంఘటనను ఖుర్ఆన్ ఈ విధంగా పేర్కొన్నది -

" ఇమ్రాన్ కుమార్తెయగు మర్యమ్ తన మానాన్ని కాపాడుకున్న స్త్రీమూర్తి. మరి మేము మా తరఫున ఆమెలో ప్రాణాన్ని ఊదాము. మరి ఆమె తన ప్రభువు వచనాలను, ఆయన గ్రంథాలను సత్యమని ధృవీకరించింది. ఎంతైనా ఆమె వినయవిధేయతలు గల మహిళా రత్నాల రాసికి చెందినది". (66: 12)

## యేసు కూడా అందరిలా మానవ మాత్రునిగానే జీవించారు:

మర్యమ్ కుమారుడగు ఏసు (ఈసా)కు దేవుడు మహిమలు ఇచ్చాడు. దేవుని ఆజ్ఞతో ఆయన కుష్టు రోగులకు స్వస్థతను ప్రసాదించేవారు. దేవుని ఆదేశంపై ఆయన మృతులను లేపి నిలబెట్టేవారు. అంధులకు చూపును ఇచ్చేవారు. అంత మాత్రాన ఆయన మానవాతీతులుగానీ, దైవాంశ సంభూతులు గానీ కారు. దేవుడు తన ప్రవక్తలలో కొందరికి, కొన్ని విషయాలలో ప్రాధాన్యతను ప్రసాదించాడు. ఇదంతా దైవ మహిమ. తండ్రి లేకుండా పుట్టినంత మాత్రానికే యేసుకు దైవత్వాన్ని ఆపాదించవలసి వస్తే, మరి తండ్రి-తల్లి ఇద్దరూ లేకుండానే సృష్టించబడిన ఆదాముకు ఏ 'స్థానం' కల్పించాలి?

అదలా ఉంచితే యేసుక్రీస్తు వారు ఇస్రాయీల్ సంతతి ప్రజల మధ్య పెరిగి పెద్దవారయ్యారు. దైవాజ్ఞలను పాలించారు. ప్రజలకు దైవ సందేశాన్ని అందజేశారు. సాటి మనుషులు తిన్నట్లే అన్నం తిన్నారు. అందరిలాగానే పానీయాలు పుచ్చుకున్నారు. అందరి మాదిరిగానే కాలకృత్యాలు తీర్చుకున్నారు. మానవ నైజానికి విరుద్ధమైన పద్ధతిలో ఏమీ ఆయన జీవించలేదు. అన్నపానీయాలు భూమ్మీద నివసించే మానవుల తప్పనిసరి అవసరాలు. ఏసుక్రీస్తుగానీ, మరియమ్మగానీ దేవుళ్ళు కారని చెప్పటానికి ఇవి ప్రబల తార్కాణాలు. ఒక్క దేవుడు మాత్రమే మానవ సహజమైన ఈ దౌర్బల్యాలకు అతీతుడు. ఈ వాస్తవాన్నే దివ్య ఖుర్ఆన్ ఇలా విశదీకరించింది-

"మర్యమ్ కుమారుడైన మసీహ్ ఒక ప్రవక్త తప్ప మరేమీ కాడు. ఆయనకు మునుపు కూడా ఎంతో మంది ప్రవక్తలు గతించారు. ఆయన తల్లి సద్వర్తనురాలు. ఆ తల్లీకొడుకులిరువురూ అన్నం తిన్నవారే. చూడు, మేము వారి ముందు ఏ విధంగా నిదర్శనాలను తేటతెల్లం చేస్తున్నామో! అయినా వారు ఎలా తిరిగిపోతున్నారో చూడు". (5: 75)

"అల్లాహ్ దృష్టిలో ఈసా ఉపమానం ఆదం ఉపమానాన్ని పోలినదే. (అల్లాహ్) అతన్ని మట్టితో చేసి, 'అయిపో' అని ఆజ్ఞాపించగానే అతను (మనిషి) అయిపోయాడు". (3: 59)

(ఇంకా ఉంది)

# దైవేతర దాస్యాన్ని సహించని

# పక్షి







షేఖ్ రియాజ్

**సర్వ** లోకాల సృష్టికర్త అయిన అల్లాహ్ ఈ భూమ్మీద మానవ సృష్టిని ప్రారంభించినప్పటి నుండి మానవుల రుజుమార్గం కొరకు ఎందరో ప్రవక్తలను పంపాడు. ఈ ప్రవక్తల పరంపరలో సులైమాన్ (عليه السلام) ప్రవక్త కూడా ఒకరు. ఈయనగారి ప్రస్తావన బైబిల్ పాత నిబంధనల్లో సొలోమోను (SOLOMAN) ప్రవక్తగా ఉంది. కాని బైబిల్‌లో ఈ ప్రవక్త మీద ఎన్నో అసభ్య, అసత్య ఆరోపణలున్నాయి. వీటన్నింటిని దివ్య ఖుర్ఆన్ ఖండిస్తుంది. ఇంకా ఈయన సచ్ఛీలతను, సౌశీల్యాన్ని, ఒక ప్రవక్తకు ఉండవలసిన హోదాను, గౌరవాన్ని, మర్యాదను చాటి చెబుతుంది.

అల్లాహ్ హజ్రత్ సులైమాన్ (عليه السلام) గారికి మానవ జాతి చరిత్రలోనే కనీవిని ఎరుగని, ఇంకా ఎవ్వరికీ ఇవ్వబడని రాజ్యాధికారాన్ని ప్రసాదించాడు. ఈయన గారి రాజ్యంలో మానవులు, జిన్నాతులు, పక్షుల సైన్యాలు ఉండేవి.

**“సులైమాను కోసం మానవులు, భూతాలు (జిన్నాతులు), పక్షుల సైన్యాలు సమకూర్చబడ్డాయి. అవన్నీ క్రమ శిక్షణతో ఉంచబడుతుండేవి”.** (అన్ నమ్ల్ : 17)

ఇంకా అల్లాహ్ సులైమాన్ (عليه السلام) గారి అదుపులో గాలిని కూడా ఉంచాడు. అందువల్ల ఆయన కోరిన దిశలో గాలి వీచేది. ఆ గాలి వేగం ద్వారా నెల రోజుల పాటు చేయవలసిన ప్రయాణాన్ని ఉదయం నుంచి మధ్యాహ్న వేళకే చేసి గమ్యానికి చేరుకునేవారు. ఇంకా మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ప్రయాణించి మరో నెల రోజుల ప్రయాణాన్ని పూర్తి చేసేవారు. ఈ విధంగా ఒక రోజులో రెండు నెలల ప్రయాణం చేసేవారు.

**“ఇంకా మేము సులైమాను కోసం గాలిని అదుపులో ఉంచాము. దాని ప్రొద్దుటి (ప్రయాణ) గమ్యం ఒక మాసానికి, ఒక సాయంత్రపు గమ్యం కూడా ఒక మాసానికి సమానంగా ఉండేది”.** (సబా: 12)

ఇంకా సులైమాన్ (عليه السلام) గారికి కోరిన వస్తువులు తయారు చేసుకునేందుకు దేవుడు కరిగించిన రాగిని సెలయేరులా ప్రవహింపజేశాడు.

**“మేము అతని కోసం కరిగించిన రాగిని సెలయేరులా ప్రవహింపజేశాము”.** (సబా: 12)

ఇంకా సులైమాన్ (عليه السلام) గారికి అల్లాహ్ చీమల, పక్షుల, వివిధ జంతువుల భాషను కూడా నేర్పాడు.

“చివరకు ఆయన ఒక చీమల లోయకు చేరుకున్నప్పుడు ఒక చీమ ఇలా ప్రకటించింది: ‘ఓ చీమల్లారా! సులైమాను, అతని సైన్యాలు తెలీకుండా మిమ్మల్ని నలిపి వేసే స్థితి ఏర్పడకుండా ఉండేందుకు, మీరు మీ మీ పుట్టలలోనికి దూరిపోండి’. దాని మాటపై సులైమాను చిరునవ్వు చిందించారు”. (అన్ నమ్ల్: 18, 19)

హజ్రత్ సులైమాన్ (عليه السلام) గారి పక్షుల సైన్యంలో హుద్ హుద్ అనే పక్షి ఉండేది. అది ఆయన గారికి దారి చూపించేదిగా, గూఢాచారిగా వ్యవహరించేది. ఇంకా జలాశయాలు, సైనిక స్థావరాలు ఎక్కడెక్కడున్నాయో తెలుపుతూ ఉండేది. ఒక రోజు సులైమాన్ (عليه السلام) పక్షుల సైన్యాన్ని తనిఖీ చేస్తూ ఉంటే హుద్ హుద్ పక్షి కనబడ లేదు. తన అనుమతి లేకుండానే అది ఎక్కడికో వెళ్ళినందుకు ఆగ్రహించారు. తగిన కారణం చూపకపోతే దాన్ని శిక్షిస్తానన్నారు. కాని కొద్దిసేపటికే హుద్ హుద్ పక్షి సులైమాన్(عليه السلام) వద్దకు తిరిగి వస్తుంది. వచ్చి అది సులైమాన్ (అ)తో, “మహారాజా! మీకు, మీ సైన్యానికి కూడా తెలియని సబా రాజ్యం మరియు అక్కడి రాణి గురించిన అతి ముఖ్య సమాచారం తీసుకొచ్చాను” అని అంటుంది.

ఇంతకు ఏమిటా అతి ముఖ్య సమాచారం? అదే మానవ స్వభావానికి వ్యతిరేకమైన సమాచారం. ఆశ్చర్యాన్ని కలిగించే సమాచారం. మూర్ఖత్వాన్ని సూచించే సమాచారం. అంధకారం అలుముకున్న సమాచారం. అతి వింత సమాచారం. పక్షి సయితం ఊహించని సమాచారం.

సబా జాతి ప్రజలు, అక్కడి రాణి తమను తమ కోసం ఈ పూర్తి సృష్టిని సృష్టించిన ఆ ఏకైక సృష్టికర్త (అల్లాహ్)ను వదిలి, ఆయన

సృష్టించిన సృష్టితాలలోని ఒకటైన సూర్యుడ్ని తమ దేవునిగా చేసుకుని పూజిస్తుంది. దీనిని హుద్ హుద్ పక్షి చూసి సహించ లేకపోయింది. ఈ సమాచారాన్ని తన యజమాని అయిన సులైమాన్ (عليه السلام) గారికి తెలుపాలని, సబా జాతి వారికి సత్య సందేశాన్ని చేరవేయాలని. వారిని నరకాగ్ని నుండి కాపాడాలని ఆత్రుతతో, ఆవేదనతో, ఆ వింత సమాచారాన్ని తన యజామని వద్దకు మోసుకొని వస్తుంది.

“అతను పక్షులను తనిఖీ చేసి – ‘హుద్ హుద్ పక్షి(వడ్రంగి పిట్ట) నాకు కన్పించటం లేదేమిటి? అది నిజంగా హాజరు కాలేదా?’ అని అన్నాడు. ‘నేను దానిని కఠినంగా శిక్షిస్తాను లేదా కోసి వేస్తాను లేదా అది నాకు సరైన సంజాయిషి అన్నా ఇవ్వాలి’ (అని చెప్పాడు.) కొద్ది సేపట్లోనే అది వచ్చి ఇలా విన్నవించుకో సాగింది: ‘మీకు తెలియని ఒక సమాచారాన్ని నేను సేకరించాను. నేను సబా జాతికి చెందిన ఒక నిజ వార్తను మోసుకు వచ్చాను. ఆ జాతి వారిని ఒక స్త్రీ పరిపాలిస్తుండటం నేను కనుగొన్నాను. ఆమెకు అన్ని వస్తువులలో నుంచి (అంతో ఇంతో) ప్రసా ప్రసాదించబడింది. ఆమె సింహాసనం కూడా వైభవోపేతమైనదే. అయితే ఆమె, ఆమె ప్రజలు కూడా అల్లాహ్‌ను వదలి సూర్యునికి పూజించటం నేను గమనించాను. షైతాను వారి కర్మలను వారికి మంచివిగా కనిపించేటట్లు చేసి, వాళ్ళను సన్మార్గం పొందకుండా అడ్డుకున్నాడు. అందువల్ల వారు సన్మార్గ భాగ్యం పొందలేకపోతు న్నారు”. (అన్ నమ్ల్: 20-24)

సోదర సోదరీమణులారా! దేవుడు ఈ పూర్తి విశ్వంలోని సృష్టి రాసులకంటే మనిషిని అత్యుత్తమమైన, శ్రేష్టమైన జీవిగా సృష్టించాడు. మనిషి అందంలోనూ, ఆకారంలోనూ, జ్ఞానంలోనూ పక్షుల కంటే ఎన్నో రెట్లు ఉన్నతంగా సృజించబడ్డాడు. మనిషికి దేవుడిచ్చిన బుద్ధిజ్ఞానాన్ని వినియోగించి శాస్త్ర సాంకేతిక పరంగా ముందుకు దూసుకుపోతున్నాడు. చంద్ర మండలంపై కాలు మోపాడు. పక్షిలా గాలిలో ఎగురుతున్నాడు. చేపలా నీటిలో ఈదు తున్నాడు. మనిషికి కావలసిన మరెన్నో వస్తువులను తయారు చేస్తున్నాడు. కొత్త కొత్త వ్యాధులకై సయితం మందులను కనుగొంటున్నాడు. ఇలా వైద్య రంగంలో కూడా ముందుకు పోతున్నాడు. అన్ని రంగాలలోనూ కొన్ని సార్లు వైఫల్యం చెందినా కూడా తరువాత విజయం సాధిస్తున్నాడు. కాని ఇవన్నీ చేసేదానికి మనిషికి ఈ సృష్టిలోని, తమ పరిసరాలలోని దేవుడు ఉనికిలోకి తెచ్చిన వస్తువుల మీదనే ఆధార పడివున్నాడు. వాటి ద్వారానే తను చేయదలుచుకున్నది చేస్తున్నాడు. దేవుడు సృష్టించిన ఈ విశ్వంలో మనిషి ఇన్ని విధాలుగా లబ్ది పొందుతూ విలాసవంతమైన జీవితం గడుపుతూ, జ్ఞానవంతుడిగా, మేధావిగా, తెలివిగలవాడుగా సమాజంలో పేరు ప్రఖ్యాతులను పొందుతూ, బుద్ధిజ్ఞానాలలో తనకు సాటి ఎవరూ లేరు అని విర్రవీగుతున్నాడు. కాని శోచనీయ మైన విషయమేమిటంటే, ఇన్ని తెలివి తేటలు, బుద్ధి జ్ఞానాలు ఉండి కూడా దేవుని విషయంలో మటుకు మోసపోతున్నాడు.

ఈ విశ్వంలోని ప్రతి వస్తువు వెనుక ఒక అద్భుతమైన శక్తి ఉంది. అది ఈ సృష్టినంతటిని ఒక పద్ధతి ప్రకారం నడుపుతోంది అని ఈ విశ్వంలోని ప్రతి వస్తువూ ఘోషిస్తూ ఉంటే మానవుడు మాత్రం సృష్టికర్తను తెలుసుకునే విషయంలో పొరబడుతున్నాడు. తన ఆత్మకు అన్యాయం చేస్తూ దేవుని విషయంలో మూఢ నమ్మ కాలను పెద్దల వారసత్వమంటూ సమాజంలో ఉండే ఆచారాలను, గుడ్డిగా నమ్మి, దేవుడిచ్చిన బుద్ధిజ్ఞానాలను, తెలివితేటలను ప్రక్కన పెట్టి విశ్వకర్తను వదలి సృష్టితాలను దైవాలుగా చేసుకొని పూజిస్తున్నాడు. ఎంత అన్యాయం! ఎంత ఘోరం! ఏమిటి మనిషి ఒక పక్షిలా కూడా ఆలోచించలేకపోతున్నాడా? ఎంత విడ్డూరం!

## అతడు మాట్లాడుతాడు....

hissa hilal

నేనొక చెడును చూశాను
అసాంఘిక ‘ఆదేశాల’ కళ్లలో
న్యాయాన్ని అన్యాయంగా
గందరగోళం చెంది విమర్శించిన వేళ
నేనొక చెడును చూశాను
నేను ఈ సత్యాన్ని చెప్పినప్పుడు
ఒక కర్కశ పశుతుల్యుడు కన్పిస్తాడు
దాక్కున్న చోటు నుంచి వచ్చి
అతడు ఆటవికం, ఆలోచనలో, ఆచరణలో
ధుమధుమలాడుతున్నాడు. కన్నూమిన్నూ కానడు
మృత్యువును దుస్తులుగా ధరించాడు,
బెల్టులో బంధించి!
అతడు మాట్లాడుతాడు
అధికారిక, శక్తివంతమైన వేదికల నుంచి
ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ
శాంతిని కోరే ప్రతి ఒక్కరిని కల్లోల పరుస్తూ
ప్రశ్నించే సాహసం పారిపోయింది
సత్యం మూల ఒదిగింది, మౌనంగా
సొంత లాభం మన గొంతుల్లో అడ్డుపడింది
సత్యం మాట్లాడకుండా!

**(2006లో అరబ్ ఎమిరెట్ ప్రభుత్వాలు అబూధాబీ అథారిటీ ద్వారా ఏర్పాటు చేసిన ‘ద మిలియన్స్ పొయిట్’ కార్యక్రమంలో ఈ కవితకు మూడవ బహుమతి లభిం చింది. - 01-11-2010 సాక్షి దిన పత్రిక సౌజన్యంతో)**

మూలం
సయ్యిద్ అబ్దుల్ హకీమ్ (ఖతర్)

అనువాదం
అబ్దుల్ బాసిత్ ఉమ్రీ (ఖతర్)

# మానవ జీవిత లక్ష్యం?



మనిషి యదార్థ జీవిత లక్ష్యం ఏమిటి? దైవ సంతుష్టి; అనగా దేవుని సంతుష్ట పర్చడం. దైవ ధ్యానం వల్లనే అతనికి మనఃశాంతి మరియు సంతృప్తి కలుగుతుంది. దివ్యఖుర్‌ఆన్‌లో ఈ యదార్థం పేర్కొనబడింది: **"జాగ్రత్తగా వినండి! అల్లాహ్‌ను స్మరించుట వల్లనే మనసులకు యదార్థమైన శాంతి లభిస్తుంది".**

(రఅద్: 28)

ప్రాపంచిక రుచులు జీవిత లక్ష్యం కాలేనపుడు, కీర్తి ప్రతిష్టలు, ఉన్నత స్థానాలు, పదవులు, పేరు ప్రఖ్యాతులు మొదలగునవి ఉన్నత విలువలని భావించి, వాటిని పొందటమే అసలు జీవిత లక్ష్యమని నిర్ణయించడం ఎంతవరకు సబబు? కొందరికి నాలుక రుచుల కంటే వీనుల రుచులు (పరుల నోట తమ కీర్తి ప్రతిష్టలు మరియు పొగడ్తలు వినడం) అంటే మిక్కిలి ప్రియంగా ఉంటుంది. వారు ఈ చవక రుచి కోసం విలువైన రుచులను వదులుకోవడానికి సిద్దపడతారు. కష్టాలకు గురికావడానికి కూడా వెనుకాడరు. దుఃఖ విచారాలను సహించడానికి సిద్ధపడతారు. ఆపదలకు, అపాయాలను ఎదుర్కోడానికి తయారుగా ఉంటారు. వట్టి పేరు ప్రతిష్టల కొరకు ఆపదలకు మరియు కష్టాలకు గురి కావడం ఎందుకని ప్రశ్నించినా వారు పట్టించుకోరు. యదార్థానికి పేరు ప్రతిష్ఠల అభిలాషి ప్రాపంచిక రుచిని ఆరాధించినవాడు. ఒక విధమైనటువంటి ప్రాపంచిక రుచి గ్రోలడమే అతని ఆరాధ్య దైవం. తన ఘనతను ప్రకటించడం మరియు గొప్పలు చెప్పుకోవడం - ఇదే అతని ఉద్దేశ్యంగా ఉంటుంది. దాని సాధన కొరకు అతడు విలువైన వస్తువులను కూడా బలి చేయడానికి సిద్ధ పడతాడు.

పేరు ప్రతిష్ఠల పిపాసి తన ఆనంద హర్మ్యం గాలిపై నిర్మిస్తాడు. ప్రజల నోటి నుండి వెలువడే పొగడ్తలు వట్టి గాలి పలుకులు కాకపోతే మరేమిటి? మానవుని వద్ద గాలిపై అధికారం చలాయించే శక్తి ఉందా? రోజు గాలి వాటం ఎటువైపు ఉంటుందో ఎవరికి తెలుసు? లోకులు కాకులు. ఈనాడు వారు తమ కథానాయకున్ని అత్యంత ఉన్నత శిఖరాలకు చేరుస్తారు. రేపు అతన్నే అకారణంగా నీచత్వ లోయలో పడవేస్తారు. నేడు పొగడ్తలు, ప్రశంసలుంటే, రేపు చీవాట్లు, గద్దింపులుంటాయి. మరి కొంత కాలం తర్వాత మనో రంగం నుండి అతని తొలగింపు మరియు అతన్ని మరిచిపోవడం జరుగుతుంది. పేరు ప్రతిష్ఠల అభిలాషులకు ప్రజల మన్ననలు అందుకున్న తర్వాత చివరకు జరిగే పర్యవసానం ఇదే. బ్రిటన్‌కు చెందిన వెల్లింగ్టన్ వాటర్లూ యుద్ధంలో నెపోలియన్‌ను ఓడించి విజయం సాధించాడు. అంతేకాక తన కాలపు నాగరికతా సంస్కృతులు నాశనం కాకుండా రక్షించాడు. ప్రజలతన్ని ఆదర గౌరవాలతో సత్కరించారు. మరియు వీర యోధుడని బిరుదు ఇచ్చారు. కాని కొద్ది కాలం పిదపనే ఆ ప్రజలే కోపోద్రేకులై లండన్ వీధుల్లో గుమిగూడి వెల్లింగ్టన్ తన జీవితాంతం కాపాడుతూ వచ్చిన అతని ప్రతిమను రాళ్ళతో కొట్టి నేలకూల్చి పగలగొట్టి మట్టిలో కలిపేశారు. ఒకప్పుడు జూలియస్ సీజర్ రోమ్ సామ్రాజ్యానికి నియంతగా పరిపాలన గావించాడు. కాని కృతఘ్నులైన తన నేస్తాల చేతులతోనే చంపబడ్డాడు. మహా వీరునిగా పేరు పొందిన అలెగ్జాండరు మరణించిన తర్వాత అతని మృతదేహం నెల రోజుల వరకు ఖనన సంస్కారాలు చేసేవారు లేక కుళ్ళుతూ పారవేయబడి ఉంది. గౌరవ లాంఛనాలతో ఆ మృత దేహాన్ని భూమిలో ఖననం చేసేవారు లేకపోయారు. పేరు ప్రతిష్ఠలు పొందడానికి కృషి చేసినవారికి లభించిన 'మర్యాద' ఇదే.

పేరు ప్రతిష్ఠల వల్ల మానవ జీవితంపై పడే ప్రభావం ఏమిటి? పేరు ప్రతిష్ఠల వల్ల గర్వాహంకారాలు జనిస్తాయి. తత్ఫలితంగా మానవుడు తనను తాను ఉత్తమునిగా, ఇతరులను అధములుగా, హీనులుగా భావిస్తాడు. అతనికి దైవ భక్తి కలిగి ఉండమని హితవు చేస్తే గర్వంతో విర్రవీగుతూ దైవ నియమిత శాసనాలను ఉల్లంఘిస్తాడు. అతనికి అడుగడుగునా అతని స్వభావానికి విరుద్ధమైన సంఘుటనలు ఎదుర్కోవలసి వస్తుంది. ఒకడు నిందిస్తాడు, మరొకడు ఆక్షేపిస్తాడు, ఇంకొకడు ద్వేషిస్తాడు.

ఒకడు నీవు 'అపవిత్ర నీటిబొట్టు' నుండి జన్మించావని పలికితే, వేరొకడు నీవు వింత పశువువని అంటాడు. ఇలా అతని ప్రతి లోపం లోకం యెదుట బహిర్గతమవుతుంది. అతని ఏ తప్పు కూడా ప్రజల దృష్టి నుండి దాగదు.

పేరు ప్రతిష్ఠలు పొందాలనే కోరిక, ఔన్నత్యాభిలాష మొదలగునవి అతన్ని వేలకొలది దుఃఖాలు మరియు కష్టాల్లో ముంచి వేస్తాయి. ఎందుకంటే అతను దైవంతో గల తన సంబంధాన్ని తెంచుకుని దాసులతో తన సంబంధం పెంచుకున్నాడు. దేవుని విడిచిన తర్వాత దేవుని దాసుల వల్ల దుఃఖ విచారాలు తప్ప వేరే ఏమీ లభించే ఆశ ఉంటుంది? సత్య దైవ ప్రవక్త ముహమ్మద్ (స) గారు ఆ వ్యాధిని గురించియే ఇలా హెచ్చరించారు:

**"మనోకాంక్షల అనుసరణ మరియు ఆత్మ స్తోత్రాభిలాష మొదలగునవియే ప్రజలను సర్వ నాశనం చేయును".**

దైవ ప్రవక్త గారు ఇదే విషయాన్ని మరొక ఉపమానం ద్వారా ఇలా వివరించారు - రెండు ఆకలిగొన్న క్రూరమైన తోడేళ్ళు గొర్రెల మందపై దాడి చేసి యెంత భయంకరంగా నష్టపరుస్తాయో అంతకంటే ఎక్కువగా ఒక ముస్లిం యొక్క ధన ధాన్యాల మరియు గౌరవాంతస్థుల ప్రేమ అతని ధర్మాన్ని నష్ట పరుస్తుంది". (ముస్లిం)

"గౌరవాంతస్థుల వ్యామోహం వల్లనే ఔన్నత్యాభిలాష లేదా గర్వ సంకల్పం జనిస్తుంది. మానవుడు ఈ అపకారిని దూరం చేయనంతవరకు అతని మరణానంతర జీవితం సఫలీకృతం కాజాలదు. దివ్య ఖుర్‌ఆన్ ఈ యదార్థాన్నే ఇలా పేర్కొంది: "ఇది అతి గొప్ప పరలోక గృహం, ఎవరైతే ఇహలోకంలో గర్వాహంకారాలు లేకుండా, కల్లోలం రేకెత్తించకుండా ఉందురో వారికే ఆ పరలోక గృహాన్ని ప్రసాదించెదము, మరియు సత్ఫలితము దైవభక్తులకే లభించును". (ఖసస్: 83)

ఒకప్పటి ముస్లింల పాలకుడైన ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ (క్రీ.శ. 682 - క్రీ.శ. 720) తన మరణ సమీపాన పైన పేర్కొనబడిన ఖుర్‌ఆన్ వాక్యాన్ని పఠిస్తూ, చివరకు ఆ పఠన స్థితిలోనే మరణించారు.

పైన తెలుపబడిన విషయాల వల్ల మనం అపార్థాలకు గురి కాకూడదు. అనగా విజ్ఞానంలో, విద్యలో, కళలో పరిపూర్ణత, ప్రావీణ్యత, నైపుణ్యం పొందటం తప్పు కాదు. మనం విద్యా విజ్ఞానాల్లో ప్రవీణులు కావటాన్ని, కళావృత్తుల్లో నిపుణులు అవటాన్ని ఇస్లాం ప్రోత్సహిస్తుంది. కాని మానవుడు తన వాస్తవాన్ని మరవకూడదు. మరియు తన ప్రభువు యొక్క గొప్పతనాన్ని మరచిపోరాదు.

కానీ ఒక వ్యక్తి తనలోని ప్రావీణ్యతా నైపుణ్యతలు చూసుకుని గర్వాహంకారాలతో విర్రవీగుతూ, తనను తాను అతి గొప్పవానిగా, పరులను హీనులుగా భావించటం తగదు. అలాగే ప్రావీణ్యతా నైపుణ్యతలు సంపాదించి వాటి ద్వారా ప్రజల మనసులు మరియు శరీరాలపై తన అధికారం చెలాయించగోరటం, మరియు దాని వల్ల లభించే మానసిక రుచిని గ్రోలటమే జీవిత లక్ష్యంగా భావించటం సరికాదు.

దీని గురించియే సత్య దైవ ప్రవక్త ముహమ్మద్ (స) గారు ఒక ప్రార్థనా రూపంలో రుజు మార్గం చూపారు. "ఓ అల్లాహ్! నన్ను ఓర్పు వహించువానిగా మరియు కృతజ్ఞునిగా చేయుము. నన్ను నా దృష్టిలో చిన్నవానిగా, మరియు ప్రజల దృష్టిలో పెద్దవానిగా జేయుము".

ఒక వ్యక్తి తన మనసులో తనను తాను ఒక మామూలు వ్యక్తిగా భావిస్తూ, తన నిస్సహాయ స్థితిని మరచిపోకుండా, తన యందున్న అజ్ఞానం పొరపాట్లు మొదలగు లోపాలను గుర్తుంచుకుంటే అతని మనసులో ఆత్మ స్తోత్రాభిలాష ఉండదు, గర్వాహంకారాల నీచ భావనా ఉండదు.

ఇక మానవ జీవిత అసలు లక్ష్యాన్ని తెలుసుకుందాం. ఎందుకంటే దివ్య ఖుర్‌ఆన్ మార్గ దర్శ్యాధారంగా జీవిత లక్ష్యాన్ని తెలుసుకోవడం తప్పనిసరి.

మనందరి దేవుడు మరియు సర్వ లోకాలకు ప్రభువైన అల్లాహ్‌ను ఆరాధించటమే సర్వ మానవుల, సర్వ జిన్నుల మరియు ఇతర సృష్టిరాసు లన్నింటినీ సృష్టించడానికి అసలు లక్ష్యం.

దివ్య ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ పలుకులను గమనించండి! "సర్వ జిన్నులు మరియు సర్వ మానవులు నన్ను ఆరాధించుట కొరకే నేను వారిని సృష్టించాను". (జారియాత్: 56)

దైవప్రవక్తలందరి సందేశం యొక్క సారాంశం ఇదే. "ఓ నా జాతివారలారా! అల్లాహ్‌నే ఆరాధించండి. మీ కొరకు ఆయన తప్ప వేరే ఆరాధ్యులెవరూ లేరు".

మానవ జీవిత అత్యుత్తమ లక్ష్యం అల్లాహ్‌ను ఆరాధించటం, మరియు అందరికంటే ఎక్కువగా ఆయననే ప్రేమించటం. దివ్య ఖుర్‌ఆన్‌లో సత్య విశ్వాసుల గురించి ఇలా తెలుప బడింది: "సత్య విశ్వాసులు (సత్య ముస్లింలు) అత్యధికంగా అల్లాహ్ పట్ల ప్రేమ కలిగి ఉంటారు". (బఖరా: 165)

మనందరి సర్వ ఆరాధనలు, మన జీవితం, మన మరణం మొదలగునవన్నీ స్వచ్ఛంగా అల్లాహ్ కొరకే అంకితం కావాలి. దివ్య ఖుర్‌ఆన్‌లో ఇలా హితవు చేయబడింది: **"ఓ దైవప్రవక్తా! ఇలా ప్రకటించుము-నిశ్చయంగా నా నమాజు, నా సర్వారాధనలు, నా జీవితం, నా మరణం- అన్నీ సర్వ లోకాలకు ప్రభువైన అల్లాహ్‌కే అంకితం. ఆయనకెవరూ సాటి లేరు. నాకు ఇదే ఆదేశం ఇవ్వబడింది. మరియు నేను మొట్ట మొదటి విధేయుడను".** (అన్‌ఆమ్: 162,163)

వాస్తవమేమిటంటే అల్లాహ్‌ను సంతుష్ట పర్చటమే మనందరి జీవిత లక్ష్యం. దివ్య ఖుర్‌ఆన్ తెలిపేదేమిటంటే "సత్య విశ్వాసులు అల్లాహ్ పట్ల అత్యధికంగా ప్రేమ కలిగి ఉంటారు. అనగా మన ప్రాణం, ధనం, సంతానం మొదలగు వాటి ప్రేమ కంటే ఎన్నో రెట్లు ఎక్కువ ప్రేమ అల్లాహ్ పట్ల కలిగి ఉండాలి.

అల్లాహ్ మనందరి ఆరాధ్యుడు, ప్రభువు, యజమాని, కావున మన ప్రతి కార్యంలో దైవారాధన స్పష్టం కావాలి. అనగా ప్రతి కార్యం అల్లాహ్‌ను సంతుష్ట పర్చడానికే చేయాలి గానీ, మనో కాంక్షల అనుసరణ కోసం, ప్రాపంచిక రుచి గ్రోలటం కోసం, ఇహలోక భోగాలు పొందటం కోసం పేరు ప్రతిష్ఠలు సంపాదించుట కోసం చేయరాదు. మన హృదయాలపై అల్లాహ్ అధికారమే ఉండాలి గానీ ఇతరుల అధికారం ఉండరాదు. మన చర్యలన్నింటి నిర్ణయం అల్లాహ్ ఆదేశం ప్రకారం జరగాలి గానీ, మనసు మరియు షైతాను ఆజ్ఞల అనుసారం కాకూడదు. ఇటువంటి శుభకర జీవితమే దైవభక్తి పూరిత జీవితం అనబడుతుంది. మరియు అటువంటి జీవితమే కృతార్థ జీవితం అవుతుంది.

సయ్యద్ అబ్దుస్సలాం ఉమ్రీ
abdussalamsyed@ymail.com



# నిండు చందురుడు నిరతం నీ మోమై నిలిచె

"కమసలిల్ హిమారి యహ్మిలు అస్ఫారా– ఆచరణా శూన్యమైన చదువులు వల్లె వేసే వాడు పుస్తకాలను మోసే గాడిదకు సైదోడు" అని చెప్పిన విజ్ఞాన ఖని ప్రవక్త శిఖామణి (ﷺ). 'లిమ తఖూలూన మాలా తఫ్అలూన్" – చెప్పే నీతులు పాటించకపోవడం అన్నది దైవానికి కోపం తెప్పించే ప్రక్రియ అని హెచ్చరిస్తూనే, ధనాన్ని తృణీకరించమని ధర్మశాసనాలు వల్లించే ధన స్వాములున్నారు జాగ్రత్త! అని జగతిని జాగరూక పరచిన సత్యోపదేశ స్థితప్రజ్ఞులు ఆయన (ﷺ).

"అల్లాహుమ్మ ఇన్నీ అవూజు బిక మిన్ ఇల్మిల్ లా యన్ఫవు"– దూరంగా ఉంచు ప్రభూ! నిష్ప్రయోజన విద్య నుంచి, కరుణ లేని విజ్ఞానం నుంచి. 'వ మిన్ ఖల్బిల్ లా యఖ్షవు' – దూరంగా ఉంచూ ప్రభూ! భక్తిప్రపత్తులు కరువైన హృదయం నుంచి, మానవత్వం మరణించిన మనస్సు నుంచి, చిరునవ్వెరగని నైరాశ్యం నుంచి, పిల్లల్ని ప్రేమించని అహం నుంచి, పెద్దల్ని గౌరవించని అవిధేయత నుంచి అన్న ప్రార్థనా పలుకులతో నైతిక విలువల్ని నూరిపోసిన నవయుగ వైతాళికులు ప్రవక్త (ﷺ).

'పైపై పశ్చాత్తాపంతో, ఉత్తుత్తి కన్నీళ్ళతో పాపాలు పోవు. పవిత్ర హృదయంతో, నిర్మల మనస్సుతో ప్రభువును వేడుకునే క్షమాభిక్ష వల్లనే పాప ప్రక్షాళనం జరుగుతుంది' అన్నది ఆయన చెప్పిన మాటే. 'తాత్కాలికంగా తళుక్కుమని తర్వాత జడీభవించే అమిత కార్యాచరణ కన్నా – నిరంతరం నిత్య చైతన్యరూపంలో అలరారే, గలగల పారే భక్తి ప్రవాహమే మిన్న' అన్న మాట ఆయన నోట జాలువారినదే. 'దైవ కీర్తన చేయనివాళ్ళు జీవచ్ఛవాలు, దైవ సంకీర్తనం ఆలాపించేవాళ్ళు నిత్య చైతన్యవ్రతులు' అన్న ఉపమానం ఆయన ఇచ్చినదే. 'మీరు ధర్మాత్ములుగా రూపొంది ప్రజల పట్ల నిరపేక్షతో ఉంటే, అందరి హృదయ బంధువులవు తారు. మీరు కరుణాత్ములుగా మసలితే దైవ కటాక్షానికి పాత్రులవుతారు' అని మహితోక్తిని చెప్పిన మహా ప్రవక్త ముహమ్మద్ (ﷺ).

మహా ప్రవక్త ముహమ్మద్ (ﷺ) వారిది మధుర ధ్వని. అగ్రజుల వారిది సువ్యక్త సముదాత్త రసావేశ సత్య స్వర ధుని. సంఘ సంస్కరణ పండితాగ్రేస ప్రవక్తలందరి నాయకమన్యులు ముహమ్మద్ (ﷺ). ఆయన అమృత పలుకుల్లో దివ్యావిష్కృతి సాక్షాత్కరించింది. సత్య సంధత సంపెంగలు, దయార్ద్రత దానిమ్మ మొగ్గలు, మమతల మొగలి పూరేకులు, వాత్సల్య వేప పూలు, సాత్వికత సన్నజాజులు, ప్రేమ పారిజాతాలు, అనురాగ అడవి మల్లెలు, సుగుణాల గులాబీలు, గుల్ మొహర్ల విలక్షణ రేఖల్లో, రూపాల్లో ఆయనలో ఘనీభవించాయి. ఆయనలో ప్రకృతి సౌందర్య సుకుమార సుమ దర్శనమూ ఉంది. పరలోక పరిచింతన పరిమళమూ ఉంది. ఆయన మాటలు అక్షరాలా పోతపోసుకున్న దివ్యావిష్కృతి మూటలు, సత్య ధర్మ సురుచిర మందహాసాలు. సత్య గ్రంథ సుందర సూక్తుల సుమనోహర చంద్రహాసాలు. అవి ముత్యాలు పొదిగిన హారం వలె రసరమ్యంగా, అందంగా, అతి సౌమ్యంగా జాలువారుతుంటాయి. సత్యవాక్కుల సెలయేటి నీటి వలె గలగలా పారుతూ ఉంటాయి – సత్య శోధక నరోత్తముల వైపు, సత్య పిపాస కమనీయ కరుణ ధ్యేయ హృదయాల వైపు.

దివ్య గ్రంథాల సారాంశ మకరందాన్ని రసీకరించుకున్న రసూల్‌గా, మానవాత్మ ధాత్రిని షిర్క్ నుండి విముక్తం చేసి, తౌహీద్ తన్మయ తరంగాలలో ఓలలాడించిన మానవ మహో పకారిగా, తన పసిడి పలుకే మేలుకొల్పుగా మనుజ జాతిని నడిపించిన వక్తృత్వమూర్తిగా, వారధిగా, రథసారధిగా ముహమ్మద్ (స) వారి వ్యక్తిత్వం మానవాళికే మచ్చుతునక, మానవత్వానికే తలమానికం. అందుకే ఆ సుగుణాగ్రజుణ్ణి జీవితపు అన్ని రంగాల్లోనూ ఆదర్శంగా పేర్కొన్నాడు అల్లాహ్: **"నీవు నిస్సందేహంగా మహోన్నతమైన శీల శిఖరాధిరోహుడవు –మహాగ్ర సౌశీల్యవంతుడవు".** (ఖలమ్: 4) "నిశ్చయంగా దైవ ప్రవక్తలో మీ కొరకు ఉత్తమ ఆదర్శం ఉంది". (అహ్జాబ్: 21)

ఆయన (స) ప్రజల కోసం పుట్టి, ప్రజల కోసం పెరిగి, విశ్వ శాంతి కోసం పాటుపడుతూ జీవించారు. అది చూసి అల్లాహ్ ఇలా అన్నాడు: **"(ఓ ముహమ్మద్!) ఒకవేళ జనులు ఈ మాటను విశ్వసించకపోతే నువ్వు వారి వెనుక దుఃఖంతో కుమిలిపోతూ నీ ప్రాణాలు పోగొట్టుకుంటావా ఏమీ?"** (కహఫ్: 6)

తలపై మిలమిలలాడే పచ్చని తలపాగ. తళతళ మెరిసే కుండల పాశము. చెక్కిళ్ళపై జీరాడే నీలాల ముంగురులు. అందమైన అంగ సౌష్టవం, సుందర దేహంతో మదీనాలో ప్రవేశిస్తుండగా ఆ పుర ప్రజలు పరుగులిడిరి అభిమానం ముసురు కోగా!

అది మదీనా చరిత్రలోనే కనీ వినీ ఎరుగని మహోజ్వలమైన రోజు. నగర వాడవాడల్లో, వీధుల్లో దైవ సంకీర్తనలు మిన్ను ముదుతున్నాయి. అన్సార్ బాలికలు సంతోషాతిరేకంతో గేయా లాపనలు చేస్తున్నారు....

**"మాపై నిండు చందురుడు ఉదయించాడు**
**'వదా' పర్వత శిఖరాల మధ్య నుండి**
**అభినందనాలు, దైవానికి ధన్యవాదాలు మాపై తప్పనిసరి**
**ప్రార్థించేవారు అల్లాహ్‌ను ప్రార్థించగా**
**మాలో ప్రభవించిన ఓ పూర్ణ చంద్రమా! పురుషోత్తమా!**
**నీ అమృత ప్రవచనాలే మాకు వీనుల విందు!!"**

షేక్ అబ్దుల్ అజీజ్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ బాజ్

# ఆపద వచ్చినప్పుడు పశువును జిబహ్ చేసి పేదలకు సదఖాగా ఇవ్వవచ్చునా?



**ప్రశ్న: ఏ వ్యక్తికైనా ఊహించని ఆపద ఏదన్నా సోకితే, ఉదాహరణకు:- అతని శరీరంలో ఏదైనా అవయవం తీవ్రంగా రోగగ్రస్తమైతే అట్టి పరిస్థితిలో అతను దైవ ప్రీతి కోసం ఒక పొట్టేలు లాంటి పశువును జిబహ్ చేసి అందులోని కొంత భాగాన్ని పేదలకు దానం (సదఖా) చేయవచ్చా?**

(ఖాలిద్, మక్కా)

**జవాబు:** సదఖా (దానం) ఎప్పుడైనా ఇవ్వదగినదే. మనిషి ఆరోగ్యవంతుడై ఉన్నా, అనారోగ్యంతో బాధపడుతున్నా ఎట్టి పరిస్థితిలోనయినా - దానం ఇవ్వవచ్చు. ఎందుకంటే ఆపదలను తొలగించి, పాపాలను తుడిచిపెట్టే కారకాలలో ఒక ముఖ్య కారకం సదఖా (దానం). కనుక ఎవరికయినా కాళ్ళ నొప్పులున్నా కీళ్ళ నొప్పులున్నా, శరీరంలోని వేరితర అవయవాలకు బాధ కలిగినా వారు తమ నగదు సొమ్మును దానంగా ఇవ్వవచ్చు లేదా (పేదలకు) అన్నం పెట్టవచ్చు. లేదా అగత్యపరులకు మాంసం పంచి పెట్టవచ్చు. ఈ విధంగా చేస్తూ తాను ఈ పేదలపై దయ చూపినట్లయితే అల్లాహ్ తనపై దయ దలుస్తాడని ఆశించవచ్చు. ఇందులో ఎలాంటి దోషం లేదు. మహనీయ ముహమ్మద్ (స) వారి ఈ హదీసు ద్వారా కూడా ఈ విషయానికి సమర్థన లభిస్తోంది -

**"కరుణించేవారిపై కరుణామయుడు (అల్లాహ్) కరుణిస్తాడు. మీరు నేలనున్నవారిపై కరుణించండి. నింగినున్నవాడు మీపై కనికరిస్తాడు".**

"ఎవడైతే దయచూపడో, అతనిపై కూడా దయ చూపబడదు" అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "మేలు చేయండి. నిశ్చయంగా మేలు చేసేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు". (అల్ బఖర: 195)

"నిశ్చయంగా అల్లాహ్ కారుణ్యం మేలు చేసే వారికి అతి చేరువలో ఉంది". (అల్ కహఫ్: 56)

## ఒకరి అమానతుతో వ్యాపారం చేయవచ్చునా?

**ప్రశ్న: ఒక వ్యక్తి నా దగ్గర కొంత నగదు సొమ్మును అమానతు (అప్పగింత)గా భద్రపరిచాడు. ఆ సొమ్ముతో నేను లాభం పొందగోరి, దాన్ని వ్యాపారంలో పెట్టుబడిగా పెట్టాను. దాంతో నాకు లాభం వచ్చింది. ఆ వ్యక్తి వచ్చి అడిగినప్పుడు అతని సొమ్మును పూర్తిగా వాపసు చేశాను. వ్యాపారం చేసిన సంగతి మాత్రం అతనికి చెప్పలేదు. ఈ రకమైన వర్తక వ్యవహారం ధర్మసమ్మతమా? కాదా?** (ఒక సోదరుడు, రియాజ్)

జవాబు:- ఎవరయినా ఒక వ్యక్తి మిమ్మల్ని నమ్మి, మీ వద్ద అమానతును భద్రపరచినప్పుడు, మీరతని అనుమతి లేకుండా అందులో ఎలాంటి వినియోగంగానీ, వ్యవహారంగానీ చేయ కూడదు.

అతని అనుమతి లేకుండానే మీరు వర్తక వ్యవహారం చేసినందున మీరు బేషరతుగా అతనికి క్షమాపణ చెప్పాలి. అతను మిమ్మల్ని క్షమించి వదిలిపెడితే సరి. లేకుంటే ఆ వ్యాపారం లాభాన్ని అతనికి ముట్టజెప్పాలి. లేదా చెరి సగం పుచ్చుకునేలా ఉభయులూ ఒక అంగీకారానికి రావాలి. ముస్లింల మధ్య రాజీ, సర్దుబాటు ధర్మసమ్మతమే. అయితే ఈ సర్దుబాటు కూడా ధర్మాన్ని అధర్మంగా, అధర్మాన్ని ధర్మంగా మార్చేదిగా ఉండ కూడదు.

## తగిన వరుడు దొరికినప్పుడు కాదనకూడదు

**ప్రశ్న: నాకు 24 ఏండ్లు. ఒక యువకుడు మా ఇంటికి వివాహ సందేశం పంపాడు. అతను గ్రాడ్యుయేట్, ధార్మికుడు కూడా. మా నాన్నగార్కి ఆ సంబంధం నచ్చింది. ఒకానొక సమావేశంలో నేను అతన్ని, అతను నన్ను చూసుకునేలా మా నాన్నగారు ఏర్పాటు కూడా చేశారు. అంతవరకూ ఓకె. కాని ఈ సంబంధానికి మా అమ్మ ససేమిరా అంది. ఆ అబ్బాయి ధార్మిక భావాలు గల వాడవటం మా అమ్మ దృష్టిలో మైనస్ పాయింట్. మా నాన్నగారు ఎంతగానో నచ్చచెప్పారు. అయినా లాభం లేకపోయింది... నా వ్యవహారంలో జోక్యం చేసుకోవలసిందిగా నేను షరీయత్ కోర్టుకు విజ్ఞప్తి చేయవచ్చా?** (ఒక సోదరి)

**జవాబు:** ఒకవేళ ఈ సోదరి చెప్పింది నిజమే అయితే ఈ వ్యవహారంలో ఈమె తల్లి గారి ఆక్షేపణ సరైందికాదు. పైగా ఇది అధర్మం. ఓ సోదరీ! ఈ విషయంలో నీవు నీ తల్లి మాట వినాల్సిన అవసరం లేదు. ఎందుకంటే "విధేయత చూపాల్సింది మంచి విషయాలలోనే" అన్నది మహా ప్రవక్త (స) మహితోక్తి.

వివాహ సందేశం పంపిన వ్యక్తి సరిజోడీ అయినప్పుడు దాన్ని అడ్డుకోవడం, అభ్యంతరం చెప్పటం ఎంత మాత్రం భావ్యం కాదు. ఎందుకంటే మహనీయ ముహమ్మద్ (స) ఇలా వక్కాణించారు:

"మీలో ఎవరయినా వివాహ సందేశం పంపితే, అతను ధార్మికంగా, నైతికంగా ఉత్తముడో కాడో చూడండి. ఒకవేళ అతను ఉత్తముడని తెలిసినప్పుడు సంబంధం ఖాయం చేసి అతనితో వివాహం జరిపించండి. మీరు గనక ఇలా చేయకపోతే రాజ్యంలో పెద్ద ఉపద్రవం పొడసూపుతుంది".

కనుక ఓ సోదరీ! ఒకవేళ నీవు గనక ఈ విషయాన్ని షరీయతు కోర్టుకు నివేదించుకోవలసివస్తే అందులో ఎలాంటి అభ్యంతరం లేదు.

అబ్దుల్ మతీన్ ఉమ్రీ

# ముస్లిం ధార్మిక విశ్వాసం

**ప్రశ్న: తౌహీద్ (ఏకదైవారాధన)కు కట్టుబడిన ముస్లింకు ఎలాంటి ప్రయోజనం కలుగుతుంది?**

జవాబు: ఇహలోకంలో రుజుమార్గం, ప్రళయంలో శాంతి లభిస్తాయి.

**ఖుర్ఆన్:** "విశ్వసించినవారికి, విశ్వాసాన్ని దుర్మార్గంతో కలుషితం చేయని వారికే శాంతి, వారు మాత్రమే రుజుమార్గంపై ఉన్నారు". (అల్ అన్ఆమ్: 82)

**హదీస్:** "దాసులకు అల్లాహ్‌పై ఉన్న హక్కు ఏమిటంటే, ఆరాధనలో తనకు భాగస్వాములుగా చెయ్యనివారిని ఆయన శిక్షించకుండా ఉండాలి". (బుఖారీ, ముస్లిం)

**ప్రశ్న: అల్లాహ్ ఎక్కడ ఉన్నాడు?**

జవాబు: అల్లాహ్ సామ్రాజ్య పీఠం (అర్ష్)పై ఏడవ ఆకాశం మీద ఉన్నాడు.

**ఖుర్ఆన్:** "కరుణామయుడు సామ్రాజ్యపీఠం (అర్ష్)పై ఆసీనుడై ఉన్నాడు". (తాహా: 5)

**హదీసు:** నిస్సందేహంగా అల్లాహ్ ఒక గ్రంథాన్ని రాసి ఉంచాడు. 'నిశ్చయంగా నా కారుణ్యం నా క్రోధాన్ని జయించింది'. ఇది ఆయన వద్ద గల అర్ష్ మీద రాసి ఉంది.

**ప్రశ్న: మనతోపాటు అల్లాహ్ తన అస్తిత్వంతో ఉన్నాడా లేదా తన జ్ఞానంతో ఉన్నాడా?**

**జవాబు:** అల్లాహ్ మనతోపాటు తన జ్ఞానంతో ఉన్నాడు. ఆయన మనం చెప్పేది వింటున్నాడు. మనల్ని చూస్తున్నాడు.

**ఖుర్ఆన్:** "అల్లాహ్ (మూసా, హారూన్ (అ)లతో) ఇలా అన్నాడు: 'మీరు భయపడకండి. మీతోపాటు నేనూ ఉన్నాను. అంతా వింటూ ఉన్నాను. చూస్తూ ఉన్నాను". (తాహా: 46)

**హదీసు:** "నిస్సందేహంగా మీరు ఒక అస్థిత్వాన్ని వేడుకుంటున్నారు. ఆయన బాగా వింటాడు, మీకు అత్యంత సమీపంలో ఉన్నాడు, మీతోపాటు ఉన్నాడు". (ముస్లిం)

**ప్రశ్న: అతి పెద్ద పాపం ఏది?**

**జవాబు:** అతి పెద్ద పాపం షిర్కె అక్బర్, అంటే ఇతరులను అల్లాహ్‌కు భాగస్వాములుగా చేయటం.

**ఖుర్ఆన్:** "నిస్సందేహంగా అల్లాహ్ క్షమించనిది కేవలం షిర్క్ (బహుదైవారాధన) మాత్రమే. అది తప్ప ఏ పాపాన్ని అయినా తాను ఇష్టపడినవారి కొరకు క్షమిస్తాడు. ఇతరులను అల్లాహ్‌కు భాగస్వాములుగా చేసేవాడు ఎంతో ఘోరమైన అబద్ధాన్ని కల్పించు చున్నాడు". (అన్ నిసా: 48)

**హదీసు:** అతి పెద్ద పాపం ఏమిటో చెప్పండి అని ప్రవక్త (స)ను అడగడం జరిగింది. దానికి ఆయన (స) ఇలా సమాధాన మిచ్చారు: "అల్లాహ్‌కు భాగస్వాములుగా చేయడం. వాస్తవానికి ఆయనే మిమ్మల్ని సృష్టించాడు". (ముస్లిం)

అజీజుర్రహ్మాన్

# సంఘీభావానికి సంజీవని నమాజు

మానవుడు సంఘజీవి. తాను నివసించే ప్రదేశంలో నలుగురితో కలిసి ఉండాలనీ, నలుగురితోనూ తన కష్ట సుఖాలను చెప్పుకుని ఊరట చెందాలని అతను కోరుకుంటాడు. సహజసిద్ధమైన అతని ఈ కోరికను తీర్చడానికి ప్రపంచ జాతులన్నీ కొన్ని పండుగలనీ, ఉత్సవాలని నిర్ధారించాయి. చివరికి మతాల కట్టుబాట్లను లెక్కచేయని జాతులు సయితం తమ ప్రజలలోని సామూహికతను కాపాడుకోవటానికి క్లబ్బులు, వింతలు వినోదాలు, ఎగ్జిబిషన్లు, సమ్మేళనాల వంటి మనో రంజక వ్యాపకాలను ప్రవేశపెట్టు కున్నాయి.

ఈ రకమయిన వ్యాపకాల వల్ల లాభాలు కలగటంతోపాటు నష్టాలు కూడా చేకూరుతాయి. ఎందుకంటే ఏ సామూహిక వ్యవస్థకైనా ఒక సదాశయం, ఉన్నత లక్ష్యం అవసరం. సమావేశ మైన వారికి ఒక నిర్దిష్టమైన కార్యక్రమం ఇవ్వగలగాలి. అన్యథా ఆలోచనలు పెడత్రోవ పడతాయి. బులపాటం తీర్చుకునేందుకు రంగేళీ వ్యాపకాలను మొదలెడతారు. రసాస్వాదన కోసం సంగీత విభావరి కావాలంటారు. ఇక అక్కడి నుంచీ ధనాన్ని, మానాన్ని, ప్రాణాన్ని బలిగొనే ఆటపాటలు మామూలే. త్రాగుడు, జూదం, అశ్లీల ప్రహేళికలు, పందాలు వారి కాలక్షేపంలో ఒక భాగమై పోతాయి. కడకు అవి కలహాలకు, హత్యలకు దారితీస్తాయి. ఒకప్పుడు అరబ్బు ముష్రికులలోనూ ఈ చెడు అలవాట్లుండేవి.

అందుకే సమాజంలోని చెడులను కేవలం న్యాయశాసనాలతో, అధికార బలంతో అణచివేస్తే సరిపోదు. ఆ చెడులకు బదులు సమాజానికి ఏదన్నా సముచితమైన ప్రత్యామ్నాయం కూడా సూచించాలి. మానవ నైజం వాంఛించే ఓ నిర్మాణాత్మక కార్య క్రమాన్ని ఆ సముదాయానికి ప్రతిపాదించాలి. అది వారిలో సంఘీ భావాన్ని పెంపొందించటంతోపాటు అందులో పవిత్రత, పరిశుద్ధ తలు కూడా జాలు వారాలి.

అందుకే ఇస్లాం ధర్మం తన అనుయాయుల కోసం ప్రతి రోజూ ఐదు పూటల నమాజును కూడా నిర్ధారించింది. ఏడాదికి రెండు సార్లు పండుగ నమాజులను కూడా ఖరారు చేసింది. ఈ సామూ హికత ద్వారా మానవ నైజం వాంఛించే ఉబలాటం తీరటంతోపాటు దైవేతర దాస్యాల నుండి, నైతికపు రుగ్మతల నుండి సురక్షితంగా ఉండే శుభప్రదమైన వాతావరణం ప్రాప్తిస్తుంది. అంటే ఈ సంఘీభావానికి ప్రాతిపదిక సదాశయం, సదాచరణ తప్ప మరొకటి కాదు.

అలాగే 'హజ్జ్' అనే విశ్వజనీన సమ్మేళనాన్నే చూడండి. ఆ సమ్మేళనం ద్వారా విస్తృత ప్రాతిపదికపై సామాజిక, ఆర్థిక ప్రయోజనాలు ఒనగూడటంతోపాటు సోదరభావం ప్రపంచ ముస్లింలలో వెల్లివిరుస్తుంది. పశ్చాత్తాప భావంతో హృదయం ద్రవిస్తుంది. వినయ వినమ్రతలతో, భక్తి ప్రపత్తులతో వారంతా తమ ప్రభువు వైపునకు మరలుతారు. ఈ విధంగా ఇస్లాం ప్రవేశపెట్టిన ఈ సామూహిక నమాజు వ్యవస్థ మూలంగా సర్వత్రా పరిశుద్ధత, పరిశుభ్రతలు వెల్లివిరుస్తాయి.

# ఇస్తిగ్ఫార్

## ముహమ్మద్ ఖాన్ (గన్నవరం)

అహం హద్దు మీరి
'హింస' వైట్ హౌస్ ప్రతిరూపంగా మారి
చరిత్ర పుటల్ని రక్తంతో లిఖించినపుడు
ఆ ఎర్రటి అక్షరాల పరావర్తనపు వెలుగుల్లో
ముసల్మానుల మూకుమ్మడి సమాధుల్లో
నీ అందమైన దురహంకార శ్వేత రూపాన్ని
చూసుకుందువుగాని రా!
పుర్రెల గుట్టల్ని - అస్తిపంజరాలతో నిండిన
ఖబరస్తాన్‌లో, మొలుస్తున్న షహీదీల త్యాగాల్ని
తొక్కుకుంటూ రా!
'ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్'
మరో హిట్లర్ రూపమెత్తి
ఈ నిశ్శబ్ద శ్మశానాన్ని ఏలుకుందువుగాని రా!

ఒక్క కన్నీటి బొట్టును ఈదేందుకు
ఎన్నెన్ని
తెరచాపలెత్తిన పడవలు కావాలో...
ఒక్క క్షణం ఊహించు
ఒక్కగానొక్క దుఃఖ పొరను దాటేందుకు
ఎన్నెన్ని
చీకటి పొరలలో కాలం పొదిగిన
వెలుగు రేఖలు ప్రసరించాలో...!? ఆలోచించు.

ఒకే ఒక్క కన్నీటి బొట్టు లోతెంతో? అందులో...
ఎన్నెన్ని
జీవితాల వ్యధలు గడ్డకట్టుకున్నవో...!?
కరడు గట్టిన నీ ఎదను ప్రశ్నించు...!?
ఎన్నెన్ని
పవిత్ర హృదయాలు కరిగి
నదులై ప్రవహించి
ఆ కన్నీటి ప్రవాహాల్ని ప్రక్షాళన గావించాలో...!?
ఇకనైనా గుర్తించు

నేనొక నూతన శకానికి నాంది పలుకబోతున్నా
హింసకు తావు లేని
ఓ ఆధ్యాత్మిక వ్యూహాన్ని
నీ దురహంకారంపై ప్రయోగించబోతున్నా
'లా ఇలాహ ఇల్లల్లాహు
ముహమ్మదుర్రసూలుల్లాహ్'
కల్మషమైన నీ హృదయానికి
కల్మాయే దివ్యౌషధం
అవును ఇస్తిగ్ఫారే నీకు ఉపశమనం
ఇక, ఈ భూగోళంపై శాంతి పతాకం పచ్చపచ్చగా
ఎగురవేయబోతున్నా

రా, నాతో చేయి కలుపు!! ఈ ప్రపంచాన్ని
శాంతితో నింపి, కాంతితో వెల్గిద్దాం
ఆ కాంతి కిరణాలలో
'సూరయె ఫాతెహా'
పఠిద్దాం...రా!

**ఇస్తిగ్ఫార్:** హృదయంలో కరడుగట్టిన కల్మషాన్ని కడిగి స్వచ్ఛత కల్గించే ప్రార్థన.

## సుభక్తాగ్రేసరులు ఈసా (అ)

శాంతి ప్రియ

ఆదంని కూడా మానవునిగానే
అంతిమ గ్రంథం అభివర్ణిస్తుండగా ఏసును
మానవాతీతుడనుకోలేము కదా!

సృష్టి పూజ ప్రకృతి విరుద్ధం కదా!
సృష్టి మర్మాల్ని గుర్తించక తప్పదు
దాసుడు విశ్వాన్ని సృష్టించలేడు
దేవుడే దాసుడ్ని పుట్టిస్తాడు నిజమే
చరిత్ర సృష్టించింది మొన్న ఆదం (అ)ను
నిన్న ఈసా (అ)ను నేడు ముహమ్మద్ (స)ను!
ఆరాధించేది మనం ఆదంను కాదు
ఈసాను కాదు, ముహమ్మద్‌ను అంతకన్నా
కాదు, వారిని సృష్టించిన అల్లాహ్‌ను!

ప్రజా హితమే అభిమతంగా
దయారూపమే ప్రియమతంగా
అనురాగమే ఆశయంగా
మార్గదర్శకత్వమే ధ్యేయంగా
జీవించిన సుభక్తాగ్రేసరులు ఈసా!

ఆయన పలికిన నిజం -
అల్లాహ్ స్వరూపమును ఎవరూ చూడలేదు
ఆయనను పోలినది ఏదీ లేదు
అల్లాహ్ అద్వితీయుడు, అమరుడు
నేను నరుణ్ణి, మధ్యవర్తిని, మానవ మాత్రుణ్ణి
నన్ను ప్రభువుగా కొలిచితే సాధ్యమవదు
స్వర్గ ప్రవేశం - ఈ మాట
నేటికీ విశ్వవ్యాప్తంగా ఉన్న
సువార్తల్లోని సజీవ సాక్ష్యం!

మూలం:
**షేఖ్ అబూ బకర్ నజ్జార్**

# ప్రవక్త అయ్యూబ్ (عليه السلام) సహనశీలికి ఎదురైన పరీక్షలు

> **మరి అయ్యూబు (స్థితిని గురించి కూడా ఒకసారి మననం చేసుకోండి). అతను "నాకు వ్యాధి సోకింది. నువ్వు కరుణించే వారందరిలోకీ అపారంగా కరుణించే వాడవు" అని తన ప్రభువును మొర పెట్టుకున్నప్పుడు, మేము అతని ప్రార్థనను ఆలకించి, ఆమోదించాము. అతని బాధను దూరం చేశాము.**
>
> **(ఖుర్ఆన్ - 21: 83,84)**

**కొందరు** దైవ దూతలు అల్లాహ్ సృష్టిలోని కొన్ని ప్రాణుల గురించి మాట్లాడుకోసాగారు. విధేయత చూపి అల్లాహ్ ప్రసన్నతను పొందిన వారి గురించి వారు చర్చించుకోసాగారు. అలాగే అహంభావంతో విర్రవీగి అల్లాహ్ ఆగ్రహాన్ని కొని తెచ్చుకున్న వారి గురించి సంభాషిస్తుండగా ఒక దైవ దూత, "ప్రస్తుతం భూమిపై ఉన్న వారిలో అత్యుత్తముడు అయ్యూబ్. ఆయన ఉన్నత వ్యక్తిత్వం కలిగినవాడు. గొప్ప సహనశీలి. ఎల్లప్పుడూ అపార కరుణామయుడైన విశ్వ ప్రభువును స్మరిస్తూ ఉంటాడు. అల్లాహ్‌ను ఆరాధించేవారికి ఆయన గొప్ప ఆదర్శం. అందుకు ప్రతిఫలంగా అల్లాహ్ ఆయనకు దీర్ఘాయుష్షు ప్రసాదించాడు. అపార సంపదలు ఇచ్చాడు. అయ్యూబ్ ఎన్నడూ అహంభావానికి లోనవలేదు. స్వార్థం ఆయనలో లేనే లేదు. ఆయన కుటుంబం, ఆయన సేవకులు, అవసరార్థులు, బీదలు అందరూ ఆయన సంపదలో భాగం పొందుతున్నారు. ఆయన బీదలకు అన్నం పెడతారు, వారికి దుస్తులు ఇస్తారు. బానిసలకు స్వేచ్ఛను ప్రసాదించడం కోసం వారిని కొంటారు. తన నుంచి దానధర్మాలు పొందే వారు తనకు ఉపకారం చేస్తున్నట్లుగా ఆయన భావిస్తారు. ఆయన చాలా ఉదార స్వభావి, చాలా మంచివాడు" అంటూ ప్రశంసించారు.

## ఇబ్లీస్ పగ

ఈ మాటలను ఇబ్లీస్ విన్నాడు. వాడికి కోపం వచ్చింది. అయ్యూబ్ (عليه السلام)ను ఎలాగైనా ప్రలోభ పెట్టి ఆయన ధార్మిక విశ్వాసాన్ని దెబ్బతీయాలని, ఆయన్ను పతనం చేయాలని భావించాడు. వెంటనే ఆయన వద్దకు పోయాడు. ఆయన ప్రార్థనలు చెడగొట్టడానికి ప్రయత్నించాడు. ప్రపంచంలోని సుఖభోగాల గురించి ఆయనలో శ్రద్ధాసక్తిని రేకెత్తించి చూశాడు. కాని అయ్యూబ్ నిజమైన విశ్వాసి. చెడు భావాలు తనను వశపరచుకోకుండా ఆయన జాగ్రత్త పడ్డారు. ఇది చూసి ఇబ్లీస్ మరింత అసహనానికి లోనయ్యాడు. అయ్యూబ్ పట్ల వాడిలో మరింత ద్వేషం పెరిగింది.

ఇబ్లీస్ ఒక పథకం వేశాడు, అల్లాహ్‌కు అయ్యూబ్ (عليه السلام) గురించి ఫిర్యాదు చేశాడు. అయ్యూబ్ నిరంతరం అల్లాహ్‌ను స్మరిస్తున్నప్పటికీ అదంతా స్వార్థంతో చేస్తున్నదేననీ, ఆయన నిజాయితీగా దైవ స్మరణ చేయడం లేదని, అల్లాహ్ తనకిచ్చిన సంపదను వెనక్కి తీసుకుంటాడన్న భయంతోనే ఆయన దైవ స్మరణ చేస్తున్నాడనీ, ఆయనదంతా ప్రదర్శన మాత్రమేనని, దురాశతో అల్లాహ్‌ను నమ్మించడానికి ప్రదర్శిస్తున్న దైవభక్తి మాత్రమేనని అన్నాడు. "నీవు గనక అయ్యూబ్‌కిచ్చిన సంపద వెనక్కి తీసుకుంటే, ఇక నీ నామ స్మరణ చేయడు. నమాజులు మానేస్తాడు" అని అల్లాహ్‌తో అన్నాడు ఇబ్లీస్.

అయ్యూబ్ నిజాయితీ కలిగిన దైవభక్తుడని, కేవలం సంపద కోసం తనను ఆరాధించే వ్యక్తి కాదని, అయ్యూబ్ హృదయపూర్వకంగా తన పట్ల భక్తి విశ్వాసాలు కలిగిన వ్యక్తి అనీ, భౌతిక సంపదలకు - ఆయనగారి భక్తి విశ్వాసాలకు ఎలాంటి సంబంధం లేదని అల్లాహ్ సెలవిచ్చాడు. అయ్యూబ్ ప్రవక్త భక్తీ విశ్వాసాలు, ఆయన సహన శీలం గురించి ఇబ్లీసుకు అర్థం అయ్యేలా చేయాలని అల్లాహ్ నిర్ణయించుకున్నాడు. ఇబ్లీసుతో "నువ్వు, నీ సహాయకులు అయ్యూబ్ సంపద విషయం లో మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోండి" అని స్వేచ్ఛ ఇచ్చాడు.

## మొదటి పరీక్ష

ఇబ్లీసు చాలా ఆనందించాడు. తన సహాయకులందరినీ ప్రోగు చేసుకున్నాడు. అయ్యూబ్ (عليه السلام) గారి పశు సంపదను, పొలాలను, సేవకులను, భోగభాగ్యాలన్నింటినీ నాశనం చేసి ఆయన వద్ద చిల్లిగవ్వ కూడా లేకుండా చేయడానికి బయలుదేరాడు. సంతోషంతో అయ్యూబ్ వద్దకు వచ్చాడు. ఒక వృద్ధ జ్ఞాని రూపంలో అయ్యూబ్ ముందు హాజరయ్యాడు. ఆయనతో, "నీ సంపద మొత్తం పోయింది. నువ్వు దానధర్మాలకు చాలా ఖర్చు చేస్తావు కాబట్టి, అల్లాహ్‌ను ప్రార్థిస్తూ నీ సమయాన్నంతా వ్యర్థం చేస్తున్నందువల్ల నీ సంపద నాశనమయ్యిందని కొందరు చెబుతున్నారు.



నీ శత్రువులకు ఆనందం కలిగించడానికే అల్లాహ్ ఇదంతా చేశాడని మరికొందరంటున్నారు. నష్టం కలుగకుండా కాపాడే శక్తి అల్లాహ్‌కు ఉన్నట్లయితే నీ సంపదను ఆయన కాపాడి ఉండేవాడు" అన్నాడు. కాని అయ్యూబ్ (عليه السلام) నిజమైన విశ్వాసి. ఆయన జవాబిస్తూ, "నా నుంచి అల్లాహ్ తీసుకున్నదంతా నిజానికి అల్లాహ్‌కు చెందినదే. నాకు కేవలం కొంత కాలానికి మాత్రమే ఆ సంపద అధీనం చేయబడింది. అల్లాహ్ తనకు ఇష్టం వచ్చిన వారికి ఇస్తాడు, తనకు ఇష్టం వచ్చిన వారి నుంచి తీసుకుంటాడు" అని చెప్పి ఆయన అల్లాహ్ సన్నిధిలో సాష్టాంగపడ్డాడు.

ఇదంతా చూసిన ఇబ్లీసు చాలా నిరాశకు గురయ్యాడు. మళ్ళీ అల్లాహ్‌తో, "నేను అయ్యూబ్ సంపద అంతా నాశనం చేశాను. అయినా ఆయన మీ పట్ల విశ్వాసంగా ఉన్నాడు. కాని నిజానికి అతను తన నిరాశను దాచుకుంటున్నాడు. ఎందుకంటే, అతనికి చాలా మంది సంతానం ఉన్నారు. వారి ద్వారా మళ్ళీ సంపద పొందాలని ఆశిస్తున్నాడు. కాబట్టి అతని సంతానంపై నాకు అధికారాన్ని ప్రసాదించాలని కోరుతున్నాను. తండ్రికి సంతానం వల్లనే నిజమైన పరీక్ష ఎదురవుతుంది. అప్పుడు అయ్యూబ్ ఎలా తిరస్కారానికి పాల్పడుతాడో మీరే చూస్తారు" అన్నాడు. అల్లాహ్ ఇబ్లీస్‌కు అతడు కోరిన అధికారాన్ని ఇచ్చాడు. నువ్వేం చేసినా అయ్యూబ్ (عليه السلام)లో భక్తివిశ్వాసాలను ఇసుమంతైనా తగ్గించలేవని హెచ్చరించాడు.

## రెండవ పరీక్ష

ఇబ్లీస్ తన సహాయకులందరితో మళ్ళీ అయ్యూబ్ (عليه السلام)పై కుట్రలు అమలు చేశాడు. అయ్యూబ్ (عليه السلام) సంతానం నివసిస్తున్న ఇంటి పునాదులను కుదిపేశాడు. ఇల్లు కుప్పకూలింది. పిల్లలందరూ మరణించారు. ఆ పిదప అయ్యూబ్ వద్దకు పెద్ద సానుభూతి పరునివలే నటిస్తూ వెళ్ళాడు. ఆయన్ను ఓదారుస్తున్నట్లు నటిస్తూ "మీ పిల్లలు మరణించిన పరిస్థితి చాలా విచారకరమైనది. నిజంగా మీరు ప్రార్థిస్తున్న దేవుడు మీ ప్రార్థనలకు సరయిన ప్రతిఫలం ఇవ్వడం లేదు" అన్నాడు. ఈ మాటలు చెప్పి అయ్యూబ్ (عليه السلام) ఏమంటారో నని ఆత్రుతగా ఎదురు చూడసాగాడు. ఇక ఇప్పుడు అయ్యూబ్ (عليه السلام) నిజంగా అల్లాహ్ ను తిరస్కరిస్తూ మాట్లాడుతారని వాడి ఆశ. కాని అయ్యూబ్ (عليه السلام) జవాబు వాడిని మరింత నిరాశకు గురిచేసింది. ఆయన వాడికి జవాబిస్తూ, "ఇచ్చేవాడు అల్లాహ్‌యే. ఆయన తానిచ్చినది కొన్ని సార్లు తిరిగి తీసుకుంటాడు. అల్లాహ్ కొన్ని సార్లు ప్రసన్నుడవుతాడు, కొన్నిసార్లు ఆగ్రహిస్తాడు. అంతా మన ఆచరణలను బట్టి ఉంటుంది. నాకు మంచి జరిగినా, చెడు జరిగినా – ఏం జరిగినా నేను మాత్రం అల్లాహ్ పట్ల నా విశ్వాసం విషయంలో స్థిరంగా ఉంటాను. సృష్టికర్తకు ఎల్లప్పుడూ కృతజ్ఞుడై ఉంటాను" అన్నారు. ఈ మాటలు చెప్పి ఆయన అల్లాహ్ సన్నిధిలో సాష్టాంగ పడ్డారు. ఇదంతా చూసిన ఇబ్లీస్ మళ్ళీ నిరాశకు గురయ్యాడు.

## మూడవ పరీక్ష

ఇబ్లీస్ మళ్ళీ అల్లాహ్‌తో, "ప్రభూ! అయ్యూబ్ సంపద అంతా అయిపోయింది. అతని సంతానం అందరూ మరణించారు. కాని అతను శారీరకంగా చాలా ఆరోగ్యంగా ఉన్నాడు. అతను మంచి ఆరోగ్యంతో ఉన్నంత కాలం నిన్ను ఆరాధిస్తూనే ఉంటాడు. ఆ విధంగా తన సంపద, సంతానాన్ని మళ్ళీ పొందాలని ప్రయత్నిస్తాడు. కాబట్టి నాకు అతని శరీరంపై అధికారాన్ని ఇవ్వు, నేను అతని శరీరాన్ని బలహీనం చేసి వేస్తాను. అప్పుడు నీవే చూస్తావు. అతను ఏ విధంగా తిరస్కారానికి పాల్పడతాడో!" అన్నాడు. ఇబ్లీస్‌కు గుణపాఠం గరపాలని అల్లాహ్ నిర్ణయించుకున్నాడు. అయ్యూబ్ నిజమైన భక్తి విశ్వాసాలు కలిగినవారని వాడికి స్పష్టంగా తెలియజేయాలని భావించాడు. అందువల్ల ఇబ్లీసుకు అతడి మూడవ కోరికను కూడా మన్నించాడు. అయితే ఒక షరతు పెట్టాడు. "అతని శరీరం మీద నీకు అధికారం ఇస్తాను. కాని అతని ఆత్మపై, అతని మనోమస్తిష్కాలపై మాత్రం కాదు. ఎందుకంటే, ఈ ప్రదేశాల్లో నాకు సంబంధించిన జ్ఞానం, నా ధర్మం ఉంటాయి" అన్నాడు.

ఇబ్లీస్ తనకు లభించిన కొత్త అధికారంతో అయ్యూబ్ (عليه السلام) శరీరంపై దాడి చేసి దానిని అనేక వ్యాధులకు గురయ్యేలా చేశాడు. చివరకు ఆయన శరీరం కేవలం ఎముకల గూడుగా మిగిలింది. అస్థిపంజరానికి చర్మం తొడిగిన మాదిరిగా తయారయ్యింది. అనేక శారీరక బాధలతో ఆయన అలమటించటం ప్రారంభమయ్యింది. కాని ఈ బాధలన్నింటినీ ఆయన భరించారు. ఎల్లప్పుడూ అల్లాహ్ పట్ల తన విశ్వాసంలో పటిష్టంగా నిలబడ్డారు. ఈ కష్టాలు, బాధలను సహనంతో భరించడమే కాదు, ఏ విధంగానూ ఆయన ఫిర్యాదు చేయ లేదు. అల్లాహ్ దాసులు కష్టాల్లో సహాయం కోసం ఇతరుల వైపు చూడరు. అల్లాహ్ కారుణ్యం పట్ల ఎల్లప్పుడూ ఆశావాదులుగా ఉంటారు. చివరకు అయ్యూబ్ (عليه السلام) దగ్గరి బంధువులు, మిత్రులు కూడా ఆయన్ను వదిలేశారు. ఆయన్ను అమితంగా ప్రేమించే ఆయన భార్య మాత్రమే ఆయనతో మిగిలారు. కష్టాల్లో ఆమె ఆయనకు తోడుగా ఉన్నారు. ప్రేమాభిమానాలతో ఆయన్ను చూసుకున్నారు. అనేక సంవత్సరాలుగా ఆయన అనుభవించిన సుదీర్ఘ కష్టాల ప్రయాణంలో ఆమె ఆయనకు తోడుగా వెంట నడిచారు.

ఇప్పుడు ఇబ్లీస్ మరింత కలతకు గురయ్యాడు. తన సహాయకులందరినీ సలహాలు అడిగాడు. కాని ఎవరూ అతనికి సలహా ఇవ్వలేకపోయారు. ఇబ్లీస్‌నే వాళ్ళు నిలదీస్తూ, "నీ జిత్తులమారితనం అయ్యూబ్ ముందు విఫలమయ్యిందేమిటి? మానవులకు పితామహుడైన ఆదమ్‌ను ప్రలోభపెట్టడంలో నువ్వు సఫలమయ్యావు కదా... ఇక్కడ విఫలమయ్యావేంటి?" అన్నారు.

(ఇంకా ఉంది)

"నా నుంచి అల్లాహ్ తీసుకున్నదంతా నిజానికి అల్లాహ్‌కు చెందినదే. నాకు కేవలం కొంత కాలానికి మాత్రమే ఆ సంపద అధీనం చేయబడింది.

# IPC ఆధ్వర్యంలో 'ఈదుల్ అజ్హా'

ఐపిసి తెలుగు విభాగం ఆధ్వర్యంలో 16 - 11- 2010 వ తేదీ మంగళవారం నాడు ఈదె ఖుర్బానీ (త్యాగోత్సవం ప్రోగ్రాం విజయవంతంగా జరిగింది. తెలుగు ముస్లిం అసోసియేషన్ (టిఎమ్ఎ) అనుబంధంతో కువైట్ సిటీలోని మస్జిద్ అల్ హమద్‌లో జరిగిన ఈ ఉత్సవంలో 450 మంది స్త్రీపురుషులు, న్యూ ముస్లిం సోదరసోదరీమణులు పాల్గొని ప్రభువైన అల్లాహ్‌కు శ్రద్ధాభక్తుల నివాళి ఘటించారు. ఈ కార్యక్రమానికి వివిధ బ్రాంచీలకు చెందిన ధర్మ ప్రబోధకులు హాజరయ్యారు. నమాజ్ అనంతరం క్రీడా విన్యాసాలు జరిగాయి. క్విజ్ ప్రోగ్రామ్ నిర్వహించి, విజేతలకు బహుమతి ప్రదానం చేయటం జరిగింది. టిఎమ్ఎ సెక్రటరీ బ్రాదర్ షౌకత్ ఖాన్ ఆహూతులకు స్వాగతం పలకగా టిఐమ్ఎ ప్రాజెక్ట్ డైరక్టర్ న్యామతుల్లాహ్ కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయటంలో తోడ్పడిన కార్యకర్తలందరికీ, ముఖ్యంగా టిఎంఎ టీమ్‌కు, ఐపిసి తెలుగు విభాగం కృతజ్ఞతలు తెలుపుకుంటోంది.







# IPC ఆధ్వర్యంలో హజ్జ్ యాత్ర

దైవ కృప వల్ల ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా ఐపిసి సారథ్యంలో న్యూ ముస్లింలు హజ్జ్ యాత్ర చేశారు. 100 మంది న్యూ ముస్లిం సోదర సోదరీమణులతో కూడిన ఈ హజ్జ్ పయన బృందం నవంబర్ 6వ తేదీన పవిత్ర మక్కాకు బయలుదేరి వెళ్ళింది. అల్‌హమ్దులిల్లాహ్ వీరంతా హజ్ కర్మలను నిర్వర్తించి నవంబరు 20వ తేదీన కువైట్‌కి తిరిగి వచ్చారు. ఈ ఏడాది తెలుగు విభాగం తరఫున 12 మంది ముహ్తదీలు, 15 మంది ముహ్తదీయాత్‌లు హజ్ చేశారు. ఐపిసి ధర్మప్రబోధకులు మౌలానా షేఖ్ హబీబుర్రహ్మాన్ జామయి, సిస్టర్ తాహెరా బేగం సాహిబా తెలుగు సెక్షన్ తరఫున ముఅల్లిమ్‌లుగా ప్రాతినిథ్యం వహించారు.

కారుణ్య ప్రభువైన అల్లాహ్ వీరందరి హజ్జ్‌ను దయతో ఆమోదించి, రుజుమార్గాన సహనస్థయిర్యాలను ప్రసాదించాలని ప్రార్థన (ఆమీన్!)






# ఖుర్ఆన్ విజేతలకు సన్మానం

ఐపిసి ఆధ్వర్యంలో గత రమజాన్ మాసంలో జరిగిన 9వ ఖుర్ఆన్ కంఠస్థ పోటీలలో విజేతలైన వారిని ఐపిసి అక్టోబర్ 26వ తేదీ మంగళవారం నాడు ఘనంగా సన్మానించి బహుమతి ప్రదానం చేసింది. జునూబ్ సుర్రాలోని హయ్యతుల్ ఖైరియా ఆడిటోరియంలో జరిగిన ఈ సన్మాన సభకు వివిధ దేశాలకు చెందిన విజేతలు, వారి ఆత్మీయులు హాజరై ఆనంద భాష్పాలు రాల్చారు. ఐపిసి జనరల్ మేనేజర్ షేఖ్ జమాల్ నాసిర్ షత్తీ, కువైట్ వక్ఫ్ వ్యవహారాల మంత్రి ఈ సందర్భంగా సభికులనుద్దేశించి ప్రసంగించారు. ఏటేటా ఐపిసి ఆధ్వర్యంలో జరిగే ఈ ఖుర్ఆన్ పోటీలకు 'సులైమాన్ సాలెహ్ రుహైమానీ' కుటుంబీకులు స్పాన్సర్లుగా వ్యవహరిస్తున్నారు.





సయ్యద్ అబ్దుస్సలాం ఉమ్రీ
abdussalamsyed@ymail.com

## షిర్క్ పుట్టుపూర్వోత్తరాలు -6

# శాఖా చంద్ర న్యాయం

(ఆకాశంలో చంద్రుడి మీద నుంచి మేఘాలు కదిలిపోతున్నప్పుడు చంద్రుడే కదులుతున్నట్టుగా భ్రమ కలుగుతుంది. అలా భ్రమపడేవారిని ఏదైనా ఓ చెట్టు కొమ్మ కిందకు తీసుకెళ్ళి ఆ చెట్టు రెండు శాఖల (కొమ్మల) మధ్య నుంచి చంద్రుడిని చూపిస్తే ఆ చంద్రుడు కదలకుండా అక్కడే ఉన్నట్టు కన్పిస్తుంది. అలా వారి భ్రమ తొలిగిపోతుంది. అలాగే నేడు ముస్లిం సమాజంలో ప్రబలి ఉన్న ద్వంద్వ నీతి, దురాచార సంస్కృతిని చూసి ఒక సామాన్యుడు ఇస్లాం ధర్మం అంటే ఇదేనేమోనని మోసపోవచ్చు. అలా అపోహకి, అపార్థానికి గురైన వారి ముందు సత్యాన్ని సుస్పష్టంగా సాక్షాత్కరించి, దురాచారాలనేవి వ్యక్తుల ప్రవేశ పెట్టినవేగానీ, ఇస్లాంకు వాటితో దూరపు సంబంధం కూడా లేదు, అది స్వచ్ఛమైన ప్రకృతి ధర్మం, మానవాళికి దేవుడు అనుగ్రహించిన గొప్ప వరం అని తెలియజేయడమే ఈ వ్యాస పరంపర ముఖ్యోద్దేశ్యం. ఈ శాఖాచంద్ర న్యాయం ద్వారా వాస్తవాన్ని తెలుసుకుని వారి హృదయాలు తేలికవ్వాలన్నదే మా ఆకాంక్ష! - ఎడిటర్)

రండి! మనం మన విశ్వాసాన్ని పునఃపరిశీలించుకుందాం. ఖుర్‌ఆన్ మనకు ఈ విషయంలో ఎలా మార్గదర్శనం చేస్తుందో గమనిద్దాం!!

**"మీరు అల్లాహ్‌ను వదలి ఎవరిని (విగ్రహాలు, పీర్లు, ముర్షిద్లు, ఔలియాలు, దర్గాలను) ఆరాధిస్తున్నారో వారు మీలాంటి దాసులే. మీ నమ్మిక నిజం అయితే వారిని మొరబెట్టుకోండి, వారు మీ మొరలను ఆలకిస్తారేమో చూద్దాం. నడవడానికి (విగ్రహంగా ఉన్న) వాటికే మన్నా (సహజసిద్ధమైన) కాళ్ళున్నాయా? పట్టుకోవడానికి వాటికే మన్నా చేతులున్నాయా? పోనీ చూడటానికి వాటికేమైనా కళ్ళు న్నాయా? వినడానికి వాటికేమైనా చెవులున్నాయా?"**

(దివ్య ఖుర్‌ఆన్-7: 194, 195)

"మీరు వాటిని మొరపెట్టుకున్నా అవి మీ మొరల్ని ఆలకించలేవు. ఒకవేళ ఆలకించినా మీకు ఎలాంటి సమాధానమివ్వలేవు. (పైగా) అవి ప్రళయ దినాన మీ బహుదైవారాధన (షిర్క్)ను ఖండిస్తాయి".

(ఖుర్‌ఆన్-35:14)

"ఆ సర్వేశ్వరుడ్ని వదలి మీరు పూజిస్తున్న మిథ్యా దైవాలు ఓ గడ్డిపోచకు కూడా యజమానులు కారు". (దివ్య ఖుర్‌ఆన్-35: 13)

"గ్రంథ ప్రజలారా! (మార్గం మరచిన యూద, క్రైస్త, ముస్లింలారా!) దైవ ప్రవక్తల ఆగమనం ఆగిపోయి ఓ సుదీర్ఘ కాలం గడిచిపోయింది. అలాంటి పరిస్థితిలో మా ఈ ప్రవక్త (ముహమ్మద్) ఇప్పుడు మీ దగ్గరకు వచ్చి నిజ ధర్మం గురించి మీకు బోధిస్తున్నాడు. ఇక మీరు శుభవార్త అందజేసే, హెచ్చరించే ప్రవక్త ఎవరూ రాలేదే!? అని సాకులు చెప్పడానికి ఎలాంటి ఆస్కారం లేదు. శుభవార్తనంద జేసేవాడు, హెచ్చరించేవాడు వచ్చేశాడు. (మా బాధ్యత తీరిపో యింది). అల్లాహ్ ప్రతి విషయంపై అధికారం గల అసాధారణ శక్తి సంపన్నుడు". (దివ్యఖుర్‌ఆన్-5:19)

నేడు ముస్లిం సమాజంలోని అధికులు తన ఆస్తిని, ఐశ్వర్యాన్ని దర్గాలు నిర్మించడంలో, ఉరుసులు ఊరేగింపుల్లో, సమాధులపై పెద్ద పెద్ద గుంబద్లు కట్టడంలో దుర్వినియోగపరుస్తూ- దాన్నో మహా కారంగా భావించి బీరాలు పోతున్నారు. ఇలాంటి దుష్ట సంప్ర దాయాలు ముస్లింలలో సయితం ఉండటం చూసి, ఇస్లాం అంటే ఇష్టపడేవారు కూడా ముస్లింలంటే విరక్తి చెంది, ధర్మానికి, దైవానికి దూరంగా బ్రతుకుతున్న ముస్లిమేతర మేధావులు ఎంతో మంది మనకు అగుపిస్తారు. (పూర్వం యూదులు, క్రైస్తవులు) "వారు తమ ధర్మాన్ని ఆటగా, వినోదంగా, తమాషా వస్తువుగా చేసుకున్నారు. ప్రాపంచిక జీవితం వారిని మోసగించింది". (దివ్యఖుర్‌ఆన్-7:51)

అంటే, మరి మనం చేస్తున్నదేమిటి? సమాజులోని ప్రతి ఖఅదాలో - "వాక్కు సంబంధిత, ధన సంబంధిత, ఆచరణ సంబం ధిత సకల ఆరాధనలు కేవలం అల్లాహ్ కోసమే ప్రత్యేకం" అంటూనే, అన్నింటిని దైవేతర మార్గంలో వినియోగించడం దేన్ని సూచిస్తున్నదో కాస్త ఆలోచించండి.

ముస్లిం సమాజంలో ప్రబలి ఉన్న దురాచారాలను చూసే కొందరు మేధావులు 'మతం అంటే మత్తు' అన్న అభిప్రాయానికి వచ్చారు. "క్రైస్తవ సమాజంలోని దురాగతాలను చూసి ఇస్లాం కూడా అలాగే ఉంటుందన్న తప్పుడు దృక్పథంతో చెప్పిన మాటలివి అంటే-, మరి ముస్లిములైన మనకు ఇస్లాం గురించి, అది ప్రతిపాదించే సిద్ధాంతాల గురించి పూర్తి అవగాహన ఉందా? ఉంది అంటారా? అయితే మన చేతలు చెప్పేది మరోలా ఎందుకున్నాయో! 'నిప్పు ఉంటేనేగా పొగ వచ్చేది' అన్నట్టు మనలో లోపం ఉండబట్టేగా ఇతరులు వేలెత్తి చూపేది! అంతా స్వయంగా ఉన్నా వక్ర బుద్ధి గలవారు విమర్శిస్తారు అనంటారా? కావచ్చు. అయితే ఆత్మ స్తుతిని మాని, ముందు మనలో లోపమేదైనా ఉందా అని ఆత్మ విమర్శ చేసుకోవాలి.

ముందు మనం ఇస్లాం ప్రకారం జీవించాల్సి ఉంది. మన సంతానానికి సయితం చక్కగా ఇస్లామీయ శిక్షణ ఇవ్వాల్సి ఉంది. అలా చేయకపోతేనో..!? నేడు యూరప్ దేశాల్లో క్రైస్తవులు తమ చర్చీలకు వేలం పాట పాడి అమ్మేస్తున్నారు. రేపు మన సంతానం కూడా మస్జిద్‌లను భూత్ బంగళాలుగా, గబ్బిళ నివాసాలుగా మార్చివేస్తారేమో! అంగడి సరుకులా చౌకబారు ధరకే అమ్మి వేస్తారేమో!! అల్లాహ్ ఏమంటున్నాడో ఒక్క నిమిష ఆగి ఆలోచించండి!

**"వారి ముందు కరుణామయుని సూక్తులు పఠిస్తుంటే వారు కన్నీటిధారతో (అల్లాహ్ సన్నిధిలో) సాష్టాంగ పడుతుండేవారు. ఆ తర్వాత అనర్హులు, అయోగ్యులు వారికి వారసులయిపోయారు. వారు నమాజు (ప్రార్థన)ను వదిలేసి మనోవాంఛలకు బానిసలైపోయారు".**

(దివ్య ఖుర్‌ఆన్-19:58,59)

- అబుల్ హసన్



# నేటి బాలలే రేపటి పౌరులు - 8

మగ్రిబ్ అజాన్ అయ్యింది. వుజూ చేసుకుని ముందుగానే మస్జిద్‌కి బయలుదేరాడు అలీ. నమాజు అనంతరం 'దర్సె హదీసు'లో పాల్గొన్నాడు. ఆ తర్వాత పిల్లల తల్లిదండ్రుల వద్దకు వెళ్ళి రేపటి ప్రోగ్రాం కోసం వారి నుంచి అనుమతి తీసుకున్నాడు. అందరూ సరేనన్నారు.

మరుసటి రోజు ఉదయం పిక్‌నిక్ కోసం అవసరమైన సామగ్రినంతా కొన్నాడు. పిల్లలందరూ తయారవుతున్నారని కబురు అందింది. వెళ్ళి చూశాడు. అందరూ చక్కగా తయారయి ఉన్నారు. గోళ్ళు, గుండీలు కూడా సరి చేసుకున్నారు. ఇలా వారిని చూస్తుంటే 'నన్నే ఫరిష్తే' లాంటి అనుభూతి కలుగుతుంది. ఎంతో ముచ్చటగా ముస్తాబయి ఉన్నారు.

పదండి, ఇక బయలుదేరుదాం.. అందరూ తలా ఒక వస్తువు చేత పట్టుకుని ఎంతో వయ్యారంగా, నయగారంగా చేతులు ఊపుకుంటూ నడిచి వెళుతున్నారు. విహరించడం వల్ల మనస్సు వికసిస్తుందన్న వాస్తవం దృష్ట్యా అలీ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాడన్నది స్పష్టం.

అందరూ 'బిస్మిల్లాహ్' అంటూ తోటలో ప్రవేశించారు. ఆ తోటల వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా మైమరపించేటట్లుగా ఉంది. రకరకాల పూలు, ఫలాల చెట్లు ఎంతో శోభాయమానంగా ఉన్నాయి. అందరూ వెళ్ళి బావి గట్టున వున్న మర్రి చెట్టు క్రింద కూర్చున్నారు. అలి కూడా వారిలోని ఒకనిగా వారి మధ్యనే కూర్చుని ఈ రోజు మన కార్యక్రమం ముందు ఆట, తరువాత అల్పాహారం, ఆ దరిమిలా కథ. మీరందరూ రెడియేనా? అన్నాడు.

“ఓ మేమంతా రెడియే; కాని ముందు కథ చెబితే బాగుంటుంది అని కొందరు కథ పట్ల వారికున్న ఆసక్తిని కాస్త తడబడుతూనే తెలియజేశారు. అయితే అందరూ శ్రద్ధగా వినండి – అందరూ స్తబ్దులై కూర్చున్నారు.

అది ఇరాక్ దేశం. అక్కడి ప్రజలు పుణ్యాత్ముల విగ్రహాలకు అలౌకికానందంతో హారతులు పట్టడమే కాక, సూర్య చంద్ర నక్షత్రాల్లాంటి జడాలను సైతం పూజించేవారు. అలాంటి వాతావరణంలో జన్మించారు హజ్రత్ ఇబ్రాహీమ్ (అ). ఆయన తండ్రి ఆజర్ సైతం విగ్రహారాధనతో పాటు సొంతంగా తన స్వహస్తాలతో అన్య రూపాలు గల ప్రతిమల్ని తయారు చేసి, వాటిని అమ్మి సొమ్ము చేసుకునేవాడు. ప్రజలు ఆ విగ్రహాలను కొని తమ ఇళ్ళల్లో పది, ఇరవై చొప్పున ప్రతిష్ఠింపజేసుకుని, అవి తమకు మేలు చేస్తాయన్న ఆశతో వాటిని పూజించేవారు. అయితే పసివాడైన హజ్రత్ ఇబ్రాహీమ్ వీటి అశక్తతను చిన్నతనంలోనే గ్రహించారు. అప్పటి నుండే ఆయనలో సత్యాన్వేషణ కోసం తపన మొదలయ్యింది.

ఆయన యౌవనస్థుడయ్యాడు. సూర్య చంద్ర నక్షత్రాల్లాంటి ఇతరత్రా సృష్టితాలను గమనించాడు. అవి ఓ సమయం ప్రకారం వస్తున్నాయి, ఓ సమయం ప్రకారం అస్తమిస్తున్నాయి. అంటే– ఇవి ఓ అద్భుత శక్తికి తలొగ్గి తన కర్తవ్యాన్ని నెరవేరుస్తున్నాయని అర్థం చేసుకున్నారు. కనుక వీటన్నింటిని నడిపించే ఆ సర్వేశ్వరుడే తన ఆరాధనకు అసలు అర్హుడు అని నిశ్చయించుకున్నారు. ఆయన్నే ఆరాధించడం ప్రారంభించారు.

తనకు జ్ఞానోదయం అయింది సరే. కాని తన చుట్టూతా ఉన్న తన జాతివారికి ఈ సత్యాన్ని చేరవేయటం ఎలా అన్న చింతన ఆయనలో మొదలయ్యింది. తన జాతి వారి దగ్గరకు వెళ్ళి ఇలా అన్నారు:

“మీరు స్వయంగా మీ స్వహస్తాలతో చెక్కుకున్న ఈ విగ్రహాలను ఎలా పూజిస్తున్నారు? మీకెలాంటి లాభంగానీ, నష్టంగానీ కలిగించలేని వీటిని ఎందుకు పూజిస్తున్నారు? నిజానికి అల్లాహ్ మాత్రమే మిమ్మల్ని, మీ పూర్వీకుల్ని, మీరు తయారు చేసుకున్న విగ్రహాలను పుట్టించినవాడు. అలాంటి సృష్టికర్తను కాదని సృష్టితాల వెంట పడతారా?” అన్నారు. అయితే కన్న తండ్రిగాని, జాతివారుగాని ఆయనగారి హితబోధను ఖాతరు చేయలేదు.



# నెలవంక ఉత్తరాలు

## ఓ దేవుడా! మైగాడ్!

ఆధ్యాత్మికతను నేను అందరిలా చూడను. నా దృష్టిలో ఆధ్యాత్మికత అంటే ఆత్మ విశ్వాసం కలిగి ఉండటం. అనంత మయిన, అద్వితీయమైన మహా శక్తిని నమ్మటం. అయితే కష్టాలు కలిగినప్పుడు ప్రతి ఒక్కరూ దేవుణ్ణి నమ్ముతారు.

కాని నిజానికి సర్వకాల సర్వావస్థలయందు ఆయన పట్ల నమ్మకం కలిగి ఉండాలి. అలా విశ్వాసం కలిగి ఉన్నప్పుడు మనిషి తన అల్పత్వం తెలుసుకుని ఒదిగి ఉండగలుగుతాడు.

దేవుడు లేకుండా మనం లేము. ఆ సర్వశక్తునిపై నాకు ఎనలేని నమ్మకం. నేను ఆయనతో నా కష్టసుఖాలు చెప్పు కుంటాను. అంతేకాని నాకు అర్థం కాని పూజాది కార్యక్రమంలో మాత్రం పాల్గొనను. కొన్నాళ్ళ క్రితం నేను ఒక ప్రమాదంలో చిక్కుకున్నాను. దాదాపు చచ్చిపోయాననుకున్నాను. ఆ సమయం లో నాకు జీవితపు విలువ అర్థమైంది. అప్పుడు నన్ను బ్రతికిం చింది వైద్యుల చికిత్స, ఇతరుల ప్రార్థనలే గాక బ్రతికితీరాలన్న నా కోరిక కూడా. ప్రమాదానికి ముందు నాకున్న భౌతిక శక్తి, ఆధ్యాత్మిక చింతన రెండు తక్కువే కాని ప్రమాద సమయంలో దేవునిపై నాకు విశ్వాసం పెరిగింది.

ప్రమాదంలో చిక్కుకున్నప్పుడు నా మనసులో ఎన్నో ప్రశ్నలు ఉదయించాయి. నాకే ఎందుకు ఇలా జరగాలి అన్నది తొలి ప్రశ్న. దానికి నాకు నేను సమాధానం చెప్పుకొన్నాను. నన్ను చూసి చాలా మంది ఈర్ష్య పడటం వల్ల ఇలా జరిగిందని అనుకున్నా. ఇలాంటివి ఎన్నో సమాధానాలు చెప్పుకున్నప్పటికీ వీటిలో ఏదీ సరైన సమాధానం కాదని నాకర్థమయింది.

అసలు కారణం ఏమై వుంటుందా అని ఆలోచిస్తుండగా ఎవరో ఒక వ్యక్తి నా దగ్గరికి వచ్చి, 'నీకు మాత్రమే ఆ ప్రమాదం తట్టుకుని బైటపడగల్గే శక్తి ఉంది కాబట్టి!' అని చెప్పి వెళ్ళటం ఆశ్చర్య పరచింది. అప్పటి నుండి నాలో పట్టుదల పెరిగింది. త్వరగా కోలుకున్నాను. అలా చెప్పించింది ఎవరు? ఏ శక్తి... నాకు తెలియదు. కాని ఆయన మాట నా జీవితాన్ని మార్చింది. ప్రతి క్షణం దేవుడు మనల్ని గమనిస్తుంటాడనే నమ్మకం నాలో పెరిగింది. నాకు సహనం అలవడింది. నాలో ప్రేమ భావాలు పెరిగాయి. అసలు జీవితమే కొత్తగా ఉంది.

**– దుర్గా నాగ ప్రసాద్ కదలి (మల్కిపురం – తూర్పు గోదావరి జిల్లా)**

## స్ఫూర్తిదాయకం...

(3వ పేజీ మిగతా భాగం )

అయితే రాకెట్ వేగంతో పురోగమిస్తున్న వర్తమాన చరిత్ర దృష్ట్యా, అనుక్షణం రంగులు మారుతున్న విలువల దృష్ట్యా ఈ గ్రంథ పఠనం, ప్రవక్తల ఆదర్శాల అనుశీలన అవసరం ఎంత వరకు అంటారా? ఎంతవరకంటే– ప్రతి వ్యక్తి గుండెలోంచి చిమ్ముకొచ్చే తౌహీద్ సహజ భావనను, మానవులంతా ఒకే దేవుని దాసులన్న సాత్వికాలోచనను సముచిత స్థాయిలో సమాజంలో స్థాపించేంతవరకు. విజ్ఞాన సీమలనూ, ఆలోచనా వలయాలనూ ప్రక్షాళించి మరింత విస్తృత పరిచేటంతవరకు. బిక్కవోయిన బ్రతుకులకు రెక్కలిచ్చి అనంత విశ్వంలో స్వేచ్ఛగా విహరింపజేసే మొక్కవోని ఓజస్సు (బలం–సాహసం) అందించే టంతవరకు. చెప్పదలచుకున్నది సూటిగానే కాకుండా సుంద రంగా, సున్నితంగా, సుమృదు వుగా చెప్పే నైపుణ్యం సంతరింపజేసే టంతవరకు. విశ్వంలో కాంతి, విశ్వ జనుల్లో శాంతి నిండేటంత వరకు.

నేడు వైజ్ఞానికంగా మనం ఎంత పురోగమిస్తున్నా మన ఆలోచనా పరిధిపై ప్రవక్తల సంప్రదాయాల ప్రభావం భాసిస్తూనే ఉంది. ప్రవక్తల జీవితాల్లోని సుమధుర ఘట్టాలు, కొందరు సజ్జన పూర్వీకుల వ్యక్తిత్వాలు నేటి మన ఆధునికంలో సయితం ఆదర్శనీయాలుగా విరాజిల్లుతున్నాయి. నేటికీ మన దృష్టిలో విలువల వలువలు వలిచేసేవాడు షైతానే. కుతంత్రాల వ్యూహ రచనలు చేసేవాడు ఇబ్లీసే. ఫిర్ఔన్ కబంధ హస్తాలు, నమ్రూద్ కరాళ దంష్ట్రాలు, అబూ జహల్ అహంభావాలు, అబూ లహబ్ సుప్పనాతి చేష్టలూ – ఇప్పటికీ మన దైనందిన జీవితంలో జుగుప్స కలిగించే అంశాలే. నేటి నవ యువకులు కూడా ప్రవక్తలను, పుణ్యాత్ములను, పురుషోత్తములను, ధీవరులను, ధీరశాంతులను ఆధునిక యుగ విషవాయువుల్ని పారద్రోలే ప్రతీకలుగా స్వీకరించటం శుభ సూచకం. గతాన్ని గతం దృష్టిలో కాకుండా వర్తమాన స్ఫూర్తికి అనుగుణంగా మలచు కునే, భవిష్య ప్రణాళికలు రచించుకునే నూతనోత్తేజ ధోరణి ఇది.

అయితే, వారు ఎక్కడా తేలిపోకుండా, జారిపోకుండా ఏ గాలికీ కొట్టుకుపోకుండా, ఏ వానకా గొడుగు పట్టకుండా, రాత్రికి రాత్రి దిక్కులు మార్చకుండా, దేబిరించకుండా, ఎప్పుడూ వెలితి పడకుండా, లేకి అవకుండా నిరతం సత్య సఖులై, శిఖులై నిత్య స్ఫూర్తితో చైతన్య రథసారథుల్లా ముందుకు సాగాలని ఈ నూతన హిజ్రీ సంవత్సరం శుభ సందర్భంగా మనమందరం అల్లాహ్‌ను వేడుకుందాం!




ఇతరులకు ధర్మజ్ఞానాన్ని బోధించడం, ఇతరులను చెడు మార్గాన్నుండి వారించడం ముస్లిం అయిన ప్రతి వ్యక్తీ నిర్వర్తించవలసిన విధియే. కాని నీతి బోధలు చేస్తూ తాను మాత్రం ధర్మం పట్ల నిర్లిప్తత కలిగి ఉండటం, నీతికి కట్టుబడి ఉండలేకపోవడం అనే ధోరణికి మనిషి దూరంగా ఉండాలి. లేదంటే దాని పరిణామం చాలా భయంకరంగా ఉండే ప్రమాదముంది. దైవ ప్రవక్త (స) ఇలా తెలిపారు:

**“నేను మేరాజ్ రాత్రి కొందరు మనుషుల పెదాలను అగ్ని కత్తెరలతో కత్తిరిస్తుండగా చూశాను. అప్పుడు జిబ్రయీల్‌ని, ‘వీరెవరు?’ అనడిగాను. దానికి జిబ్రయీల్, “వీరు మీ అనుచర సంఘంలోని ధర్మ ప్రబోధకులు. వీరు ప్రజలకు మంచిని ఉపదేశించి తమ సంగతి మాత్రం మరచిపోయేవారు”. (మిష్కాత్)**













సాటిలేని స్వామీ! మేము హాజరయ్యాము, మా తప్పులను మన్నించు. మాలో నవ జీవన చైతన్యాన్ని నింపు. దుష్టశక్తులను ఎదిరించే సాహసాన్ని మాకు ప్రసాదించు. నీ సద్వచనాన్ని సర్వవ్యాప్తం చేసే సద్బుద్ధి నొసగు. (ఆమీన్)